# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 9 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 216 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## స్పేస్ వాక్ చేసిన అనిల్ మేనన్



2

## ఆమె పొడవు 5.5 ఫీట్లు.. జుట్టు 8 ఫీట్లు



2

# విలువలు, దేశసేవే విద్యకు మార్గదర్శకాలు కావాలి



## మంత్రి నారాలోకేశ్

**కర్నూలు, ఆగస్టు 8 మనం న్యూస్:** విద్యను ఒక లక్ష్యంగా, విలువలతో కూడిన సేవా మార్గంగా చూడాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ విద్యా పరిజ్ఞానానికి సంస్కారం, విలువలు, నైతికత, క్రమశిక్షణ, తమ సంస్కృతిపై గౌరవాన్ని జోడించుకోవాలని సూచించారు. విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించి, సంపాదించవచ్చుని.. అయితే మాతృభూమికి తిరిగి వచ్చి దేశసేవ చేయాలని అన్నారు. ఆత్మవిశ్వాసం, సంకల్పం, కష్టపడి పనిచేసే తత్వంతో ఎలాంటి సవాళ్లనైనా అధిగమించి సమాజానికి, దేశానికి అర్థవంతమైన సేవ చేయగలరని పేర్కొన్నారు. అమరావతిలోని అమృత విశ్వవిద్యాపీఠం రెండో

...మిగతా 2లో

# అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టండి

## సీఎం చంద్రబాబు

**అమరావతి, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** 'రాజకీయాల ముసుగులో చట్టవ్యతిరేక పనులకు పాల్పడినా, నిరసనల పేరుతో రోడ్లపై ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.సీఎం చంద్రబాబు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి విచ్చేశారు. అక్కడ రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెగా డీఎస్సీ అక్రమాల పేరుతో ప్రతిపక్ష వైఎస్సార్సీపీ చేస్తున్న నిరసనలు, దుష్ప్రచారాలపై సీఎం మండిపడ్డారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు.'చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి' అనే చందంగా ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### అమరావతిలో రెండు భారీ ప్రాజెక్టులు

రాజధాని అమరావతి అభివృద్ధిపై సీఎం శనివారం కీలక ప్రకటన చేశారు. ఈ ఆగస్టు నెలలోనే అమరావతిలో రెండు ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా రాజధానికి ముఖద్వారంగా నిర్మిస్తున్న ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి మరియు కీలకమైన యాక్సెస్ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. అమరావతిని దేశంలోనే 'వైర్లు లేని మొదటి ఆధునిక నగరంగా' తీర్చిదిద్దుతున్నామని ఆయన గర్వంగా ప్రకటించారు.

> చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్సార్సీపీ నేతలను తీవ్రంగా హెచ్చరించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన సీఎం, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా ఇష్టాగోష్టిలో కీలక వ్యాఖ్యలు చేశారు.

## సాగు వ్యూహం మారుద్దాం..

# పంట నష్టాలను అధిగమిద్దాం



- రైతన్నకు ధైర్యం... నేతన్నకు చేయూత
- ఇది కూటమి ప్రభుత్వం అందిస్తున్న భరోసా
- మంత్రి కందుల దుర్గేష్

**గుంటూరు/అమరావతి,ఆగష్టు 8(మనం న్యూస్):** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతాంగం ప్రత్యామ్నాయ సాగు వ్యూహాలను అవలంబించాలని గుంటూరు జిల్లా ఇన్ చార్జి మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో ఉన్న పశ్చిమ జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణ వర్షపాతంలో కేవలం 42 శాతం మాత్రమే నమోదైందని

...మిగతా 2లో



## ఇక నిరంతరం జలధార-జలహారతి

సాధారణం కంటే 39 శాతం మేర లోటు వర్షపాతం సూచనలు

ఎల్ నినోపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి

జలధార-జలహారతి పై సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్

2



## ఇంటింటా జాతీయ జెండా..

## ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి

పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమ రూపకల్పనపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

## కళాకారుల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం

పౌరాణిక, సాంఘిక నాటకాలకు పూర్వవైభవం తెస్తాం

మంత్రి కందుల దుర్గేష్

2

## 'అమరావతి చిత్రకళా వీధి' కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసే అద్భుత వేదిక

నాలుగు గోడలకే పరిమితమైన కళను ప్రజా బాట పట్టించిన కూటమి ప్రభుత్వం

అమరావతి చిత్రకళా విధి ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తాం



# ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలె

## సమస్యలే సరికొత్త అవకాశాలు కల్పిస్తాయి

- యువత దేశాభివృద్ధి బాధ్యత తీసుకోవాలె
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో విద్యార్థులకు ప్రధాని పిలుపు
- 'పరం ప్రజ్ఞ'ను ప్రారంభించిన మోడీ

**ఢిల్లీ, ఆగష్టు 8:** దేశ యువతరం సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని ప్రధాని మోడీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా సాగే దేశ ప్రయాణానికి యువత అవసరం ఎంతో ఉందని తెలిపారు. అయితే, ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దని సూచించారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో మోడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ...'ఐఐటీ ఢిల్లీ

...మిగతా 2లో

## ద్రోహులను కలుస్తారు గానీ.. విద్యార్థులను కలిసేందుకు టైము లేదా?: ఠాక్రే

2

# భాష బతికితేనే సంస్కృతి బతుకుతుంది

## ఎంపీ కేశినేని చిన్ని

**విజయవాడ, ఆగస్టు 8(మనం న్యూస్):** ఆధ్యాత్మికత, సాహిత్యం, సంస్కృతి, మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న 'శ్రీవాణి' మాసపత్రిక 500 సంచికలు పూర్తి చేయడం అభినందనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన 'శ్రీవాణి' 500వ సంచిక ఆవిష్కరణ మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.'శ్రీవాణి' 500 సంచికల ప్రస్థానం ఓ పత్రిక విజయమే కాకుండా విలువల పరిరక్షణకు సాగిన మహాయజ్ఞమన్నారు. ''భాష బతికితే సంస్కృతి బతుకుతుంది.. సంస్కృతి బతికితే జాతి బతుకుతుంది'' అని పేర్కొంటూ తెలుగు భాష, సాహిత్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తగ్గించి

...మిగతా 2లో



## వైభవంగా ప్రారంభమైన శ్రీ కోదండరామస్వామివారి పవిత్రోత్సవాలు

ఆగమశాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ, స్నపనతిరుమంజనం



3

# ఈ20తో కాలుష్యానికి చెక్.. రైతులకు మేలు



2

సిఓ ఉద్గారాల తగ్గింపు..

ముడి చమురు దిగుమతులకు ప్రత్యామ్నాయం

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

# చదువయ్యాక తిరిగొచ్చేస్తం

## 81% మంది భారత విద్యార్థులది ఇదే మాట

### ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ 'స్టూడెంట్ గ్లోబల్ మొబిలిటీ ఇండెక్స్' సర్వే నివేదిక



**లండన్, ఆగష్టు 8:** విదేశాల్లో ఉన్నత విద్య చదవాలన్న ఆసక్తి చూపుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, వివిధ దేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో 81శాతం మంది చదువు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. విదేశీ విద్యపై నిర్ణయాలు, కోర్సుల ఎంపిక, ఉద్యోగాల కోసం దరఖాస్తు, ఆయా నిర్ణయాల్లో కుటుంబాల ప్రభావానికి సంబంధించి 'స్టూడెంట్ గ్లోబల్ మొబిలిటీ ఇండెక్స్' పేరుతో ఆక్స్ ఫర్డ్ ఇంటర్నేషనల్ చేపట్టిన సర్వేలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మొత్తం 17,925 మందిని

...మిగతా 2లో

## తగ్గుతున్న వీసాలు

భారత విద్యార్థుల 'అమెరికా డ్రీమ్'కు ఇమ్మిగ్రేషన్ కత్తెర

2

# డీఎస్సీ అక్రమాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి

10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు

ఎస్ఐఆర్లో ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలి

వైఎస్సార్సీపీ కీలక నేతలతో సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్

**తాడేపల్లి,ఆగస్టు,08,(మనం ప్రతినిధి):** డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, వాటికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలను మరింత ఉధృతం చేయాలని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రజల గళాన్ని బలంగా వినిపించాలని సూచించారు. వైఎస్సార్సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీలు/పార్లమెంట్ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు/నియోజకవర్గ సమన్వయకర్తలు,

...మిగతా 2లో

# విద్యార్థులు చెప్పేది ప్రభుత్వం వినాల్సిందే

- ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ప్రోగ్రామ్ 'ఆస్క్ మీ ఎనీథింగ్'లో రాహుల్

**ఢిల్లీ, ఆగష్టు 8:** యువతకు మరింత చేరువయ్యే ప్రయత్నంలో లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇన్ స్టా గ్రామ్ వేదికగా 'ఆస్క్ మీ ఎనీథింగ్' పేరిట ఒక లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్యమాల నుంచి వ్యక్తిగత అభిరుచుల వరకు నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కొన్నింటికి హాస్యంగా, మరికొన్నింటికి రాజకీయంగా స్పందించారు. లైవ్లో ఒక నెటిజన్ 'మీరు బ్యాట్ మ్యానా?'' అని ప్రశ్నించగా.. ''నన్ను, బ్యాట్ మ్యాన్ను ఒకే గదిలో ఎవరూ చూడలేదు కదా'' అంటూ రాహుల్ చమత్కరించారు. విద్యార్థుల నిరసనల గురించి అడిగిన ప్రశ్నకు.. విద్యార్థులు ఏమి చెబుతున్నారో వినాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు. విద్యార్థుల



...మిగతా 2లో

# ఇక నిరంతరం జలధార-జలహారతి

**జలధార-జలహారతి పై సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్**

**అమరావతి, ఆగస్టు 08(మనం ప్రత్యేక ప్రతినిధి):** జలధార- జలహారతి కార్యక్రమాన్ని నిరంతర కార్యక్రమంగా చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావం అంచనాలకు మించి ఉన్నందున నీటి వనరుల పరిరక్షణ, తాగు నీటి సరఫరా, పంటల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జలధార- జలహారతి కార్యక్రమంపై శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జలధార- జలహారతి కింద మొత్తంగా 82,865 పనులను గుర్తించగా..79,826 పనులు పూర్తి చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్ల తవ్వకం వంటి పనులను చేపట్టినట్టు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఎల్ నినో తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతుందని అంచనాలు ఉన్నాయని తద్వారా వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జూన్-డిసెంబర్ మధ్య సాధారణ వర్షపాతం 867 మిల్లీ మీటర్ల మేర నమోదు అవుతుందని ప్రస్తుతం 525 మి.మీ. మాత్రమే నమోదు అవుతుందన్న అంచనాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆగస్టులో 56 శాతం మేర లోటు వర్షపాతం ఉండే ప్రమాదం ఉందని చెప్పారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్నినో ప్రభావం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ బేసిన్లల్లో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని...గత ఏడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఆగస్టు నుంచి భూగర్భజల మట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలు ఉండటంతో తాగు నీటి నిల్వలు, సరఫరా పై పక్కాగా ప్రణాళికలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి తదితర రిజర్వాయర్లలో తాగు నీటి అవసరాల కోసం నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టండి**

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదని ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకుని రిజర్వాయర్లను వీలైనంత మేర నింపాలని సూచించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగు నీటి వసతి పూర్తిస్థాయిలో అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతల మేరకు వినియోగిస్తూ పంటలకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్లో తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లోనూ పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు**

వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పశువులకు అవసరమైన మేత, నీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశు సంపదకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే భవిష్యత్లో ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు.

నీటి వనరుల సంరక్షణ అనేది నిత్యం జరగాలని చెప్పారు. వివిధ కారణాల వల్ల చాలా కాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఆమె పొడవు 5.5 ఫీట్లు.. జుట్టు 8 ఫీట్లు

- **ఇండియన్ యూట్యూబర్ వరల్డ్ రికార్డ్**

**డెహ్రాడూన్, ఆగస్టు 8:** భారత్కు చెందిన రేణు ధరియాల్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన జుట్టు ఉన్న మహిళగా కొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఉత్తరాఖండ్లోని హల్ద్వానీలో ఏప్రిల్ నెలలో ఈ రికార్డును అధికారికంగా ధృవీకరించారు. యూట్యూబర్, కంటెంట్ క్రియేటర్ అయిన రేణు ధరియాల్ నల్లని జుట్టు పొడవు 271.50 సెంటీమీటర్లు అంటే 8 అడుగుల 10 అంగుళాలు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వ్యక్తి రాబర్ట్ వాడ్లో ఎత్తు (272 సెం.మీ) కంటే స్వల్పంగా మాత్రమే తక్కువ. గతంలో ఉక్రెయిన్కు చెందిన అలియా నాసిరోవా పేరిట ఉన్న 257.33 సెం.మీ (8 అడుగుల 5.3 అంగుళాలు) రికార్డును రేణు బద్దలు కొట్టారు. రేణు 2015 నుంచి తన జుట్టును ఒక్కసారి కూడా కత్తిరించకుండా చాలా జాగ్రత్తగా పెంచుతున్నారు.

**10 ఏళ్ల శ్రమ**

భారతీయ సంస్కృతిలో పొడవైన జుట్టును అత్యంత సౌందర్యానికి, సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని, అదే తనకు ప్రేరణనిచ్చిందని ఆమె తెలిపారు. నేలపై పడకుండ, చిక్కులు పడి ఊడిపోకుండా ఉండటానికి ఆమె పెద్ద జడగా వేసుకుంటారు. ఇంత పొడవైన జుట్టును నిర్వహించడం చాలా ఓర్పుతో కూడుకున్న పని అని, జుట్టును శుభ్రం చేయడానికి చిక్కులు తీయడానికి గంటల సమయం పడుతుందని రేణు వెల్లడించారు. రసాయనాలు ఉన్న ప్రొడక్ట్స్ వాడకుండా, ఇంట్లోనే తయారుచేసుకునే సహజసిద్ధమైన నూనెలు, షాంపూలను ఉపయోగిస్తానని, జుట్టును శుభ్రం చేయడానికి, చిక్కులు తీయడానికి ఎంతో సమయం, ఓర్పు అవసరమని ఆమె చెప్పారు. భారతీయ సంస్కృతిలో పొడవైన జుట్టు అందానికి, సంప్రదాయానికి ప్రతీక అని, పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వడమే తన లక్ష్యమని రేణు ప్రకటించారు.

# స్పేస్ వాక్ చేసిన అనిల్ మేనన్

**వాషింగ్టన్, ఆగస్టు 8:** భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ శుక్రవారం విజయవంతంగా స్పేస్వాక్ నిర్వహించారు. మరో ఆస్ట్రోనాట్ జెస్సికా మెయిర్తో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోని పవర్ ఛానల్కు ఒక మోడిఫికేషన్ కిట్ను అమర్చారు. దీనివల్ల ఈ కేంద్రానికి మరిన్ని సౌరఫలకాలను అమర్చుకోవచ్చు. దాదాపు ఆరున్నర గంటల పాటు ఈ స్పేస్వాక్ సాగింది. ఈ మధ్యలో స్వల్ప విరామంలో అనిల్, జెస్సికాల మధ్య సరదా సంభాషణ జరిగింది. 'అనిల్.. మీరు చందమామను చూడొచ్చు' అని జెస్సికా పేర్కొన్నారు. దానికి అనిల్ స్పందిస్తూ.. ''నాకు కుడివైపున చంద్రుడిని చూస్తున్నా. నాకు అక్కడ భావి చందమామ ఆవాసం కనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. ఈ నెల 13న ఈ ఇద్దరు వ్యోమగాములు మరోసారి స్పేస్వాక్ నిర్వహిస్తారు.

# పంట నష్టాలను అధిగమిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుర్గేష్ తెలిపారు. నాగార్జున సాగర్, గుంటూరు ఛానల్, పట్టిసీమల ద్వారా నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా నీటి అవసరం తక్కువగా ఉండే వాణిజ్య, అంతర పంటలను సాగు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిలో మొదటి ప్రాధాన్యత తాగునీటికి, ఆ తర్వాతే సాగునీటికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తూ, ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతన్నకు 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ యోజన ' ద్వారా ఏడాదికి రూ. 20,000 ఆర్థిక సాయం అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆరేడు నెలలైనా రైతుల ఖాతాలో డబ్బులు వేసిన దాఖలాలు లేవన్నారు..కానీ కూటమి ప్రభుత్వం రైతాంగం నుంచి చిట్టచివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో తెలిపారు.

# ఇంటింటా జాతీయ జెండా.. ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి

**అమరావతి, ఆగస్టు 8,(మనం ప్రత్యేక ప్రతినిధి):** నేషన్ బిల్డింగ్ లో ప్రతి పౌరుడినీ భాగస్వామిగా చేసేలా పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్లు పూర్తి చేసుకుని 80వ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంలో... 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ నిర్ణయించుకునేలా ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమ రూపకల్పనపై శనివారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... పంద్రాగస్టు రోజన స్వాతంత్ర్య వేడుకల నిర్వహణతో పాటు... నేషన్ బిల్డింగ్ దిశగా ప్రజల్లో చైతన్యం రగిలించేలా కార్యక్రమాలు రూపొందించాలి. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలను భాగస్వాములను చేయాలి. మై నేషన్, నేషన్ ఫస్ట్ అనే భావన ప్రతి ఇంటికీ చేరాలి. 2047 లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేసేలా ప్రోత్సహించాలి. రాష్ట్ర, దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత, విద్యార్థులు కీలక పాత్ర పోషించేలా కార్యక్రమాలను డిజైన్ చేయాలి. గ్రామ స్థాయి నుంచి వివిధ రంగాల్లో లీడర్ షిప్ ఎదిగేందుకు వేదికలను సృష్టించాలి. గ్రామాల్లో ఒకప్పుడు ఉన్న స్వచ్ఛంద సేవా స్ఫూర్తిని తిరిగి పునరుద్ధరించాలి. దీనికి నేషన్ బిల్డింగ్ ఇన్ పార్టనర్స్ కార్యక్రమం వేదిక కావాలి. యువతలో ఉన్న ఆలోచనలను, ఎనర్జీలను నేషన్ బిల్డింగ్ కోసం ఉపయోగించుకోవాలి. ప్రజలు కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా.. రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనలో స్టేక్ హోల్డర్లుగా మారాలి. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని మాస్ మూవ్మెంట్గా తీర్చిదిద్దాలి.అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనిత, సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు.. పలు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఈ20తో కాలుష్యానికి చెక్.. రైతులకు మేలు

**మార్కాపురం,ఆగష్టు 8 (మనం న్యూస్):** పెట్రోల్లో 20 శాతం ఇథనాల్ కలపడం ద్వారా దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, రైతుల ఆదాయానికి మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2013-14లో 1.5 శాతం కంటే తక్కువగా ఉన్న ఇథనాల్ బ్లెండింగ్ ప్రస్తుతం 20 శాతానికి చేరిందని తెలిపారు. ఈ20 ద్వారా ఇప్పటివరకు సుమారు 544 లక్షల మెట్రిక్ టన్నుల సిఓ ఉద్గారాలను తగ్గించడంతో పాటు 181 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు వినియోగాన్ని ప్రత్యామ్నాయంగా భర్తీ చేయగలిగామని, విదేశీ మారకద్రవ్య ఆదాలో సుమారు 1.06 లక్షల కోట్ల ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. ఇథనాల్ తయారీకి వ్యవసాయ ఆధారిత ముడి పదార్థాలను వినియోగించడం ద్వారా రైతులకు అదనపు మార్కెట్, ఆదాయ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను ప్రజలు స్వాగతించాలని, ఈ20 ఇంధనం నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. అలాగే ఈ20 ఇంధనంపై ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఏలూరి విమర్శించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకుంటున్న ఇంధన సంస్కరణలను రాజకీయ కోణంలో చూడకుండా వాస్తవాలను అర్థం చేసుకోవాలని సూచించారు.

# ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలె

(మొదటి పేజీ తరువాయి)

గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది. ఇప్పుడు చదువు పూర్తిచేసుకుని మీరు అడుగుపెట్టే బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది. సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే 20-30 ఏళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి. నిత్య విద్యార్థిలా నేర్చుకోవాలి.

అలాంటి వారే విజేతలుగా నిలుస్తారు' అని ప్రధాని చెప్పారు.

మార్పు అనేది సవాళ్లు, అవకాశాలతో కూడుకుని ఉంటుంది. జీవితం మనకు ఎన్నో సమస్యలు తీసుకొస్తుంది. కానీ, ఆ సమస్యలే అవకాశాలు కల్పిస్తాయి. మీకు పెద్ద సవాలు ఎదురైనప్పుడు దాన్ని చూసి భయపడకండి. దాన్ని చిన్న చిన్న భాగాలుగా విడదీసి చూడండి. కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదు. అందుకే, ప్రశ్నించడం కాదు.. సమస్యకు పరిష్కారం కనుగొనడంపై దృష్టిపెట్టాలి'' అని మోడీ సూచించారు.''ప్రతి తరానికి జాతీయ బాధ్యత ఉంటుంది. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కూడా భాగస్వామి కావాలి. వచ్చే 30-35 ఏళ్లలో మీరు ఏం చేస్తున్నారన్నదే.. వికసిత్ భారత్ ను నిర్ణయిస్తుంది. అందువల్ల మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరే.. ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది ఆలోచించాలి.

దేశ ప్రయోజనాల కోసం మనం ఏం చేయగలమనేది ప్రశ్నించుకోవాలి'' అని ఆయన జెన్ జీకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు దీన్దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను ప్రదానం చేశారు. పతకాలు స్వీకరించిన వారిలో ఒకరిద్దరే మహిళలు ఉన్నారని, వీరి సంఖ్య ఎక్కువగా ఉంటే బాగుండేదని ప్రధాని అన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో-ఆర్డినేషన్), రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు (కో-ఆర్డినేషన్), అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో శనివారం సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఎస్సీ అంశంపై చేపట్టాల్సిన తదుపరి ఆందోళన కార్యక్రమాలతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

## భాష బతికితేనే సంస్కృతి బతుకుతుంది

(మొదటి పేజీ తరువాయి)

మంచి పుస్తకాలు చదివే అలవాటును పెంచుకోవాలని సూచించారు.విద్య ఉపాధిని ఇస్తే.. విలువలు వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయని, సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా ఆలోచనా విధానం, వ్యక్తిత్వం, సమాజం పట్ల బాధ్యత మరింత బలపడతాయన్నారు. ''మంచిని గ్రహిద్దాం.. మంచిని పెంచుదాం.. పది మందికి పంచుదాం'' అని పిలుపునిచ్చారు.శ్రీవాణి'ని 500వ సంచిక వరకు తీసుకురావడంలో శ్రీ కొమరిగిరి కృష్ణమోహనరావు అంకితభావం, నిరంతర కృషి అభినందనీయ మన్నారు. సంపాదకులు, రచయితలు, పాఠకులు, నిర్వాహకుల సమష్టి కృషితోనే ఈ మైలురాయి సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విలువలు, దేశసేవే విద్యకు మార్గదర్శకాలు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

స్నాతకోత్సవానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అతిథి గౌరవంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 319 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. వీరిలో 280 మంది బీటెక్, 39 మంది ఎంబీఏ విద్యార్థులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, విద్యా పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ఆహ్వానిత అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, కుటుంబం, సమాజం, దేశం పట్ల మరింత పెద్ద బాధ్యతకు ఇది ఆరంభమని అన్నారు. అమృత విశ్వవిద్యాపీఠం విద్యార్థులకు ఆలోచించడం, నాయకత్వం వహించడం మాత్రమే కాకుండా.. కరుణ, నిజాయతీతో సేవ చేయడం కూడా నేర్పుతోందని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగం ఎక్కడ లభిస్తుందనే దానికంటే.. తాము ఏ సమస్యను పరిష్కరించగలమనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. నూతన ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని ఆకాంక్షించారు.

# ద్రోహులను కలుస్తారు గానీ.. విద్యార్థులను కలిసేందుకు టైము లేదా?

## ప్రధానికి ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్న

**ముంబై, ఆగస్టు 8:** తమ పార్టీని వీడి శిందే నేతృత్వంలోని శివసేనలో చేరిన తిరుగుబాటు ఎంపీలతో శుక్రవారం ప్రధాని మోడీ సమావేశం కావడంపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీక్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న యువతను కలవడానికి సమయం లేని ప్రధాని.. ద్రోహులను కలవడానికి మాత్రం సమయం కేటాయించారని దుయ్యబట్టారు. శిందే వర్గానికి చెందిన పార్టీనే అసలైన శివసేనగా గుర్తిస్తూ.. ఎన్నికల కమిషన్ చేసిన ప్రకటనపై ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమను భయపెట్టాలనే ఉద్దేశంతోనే అండగా ఉంటామని మోడీ వారికి హామీ ఇస్తున్నారని ఉద్ధవ్ అన్నారు.కోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగా ఉంటుందన్నదే తన ఏకైక ఆశ అని.. ఆ విషయంలో తనకు పూర్తి నమ్మకం ఉందని ఠాక్రే పేర్కొన్నారు. మరోవైపు ప్రత్యర్థి శివసేనలో ఆరుగురు ఎంపీల విలీనాన్ని గుర్తిస్తూ లోక్ సభ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చే కేంద్ర ప్రభుత్వాన్ని కుదిపేసిన ఇటీవలి జెన్ జీ నిరసనల పరిణామాలతో దేశంలోని ప్రస్తుత పరిస్థితులు తుపానుకు ముందు ప్రశాంతతే అని పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వం ఏ తప్పు చేసినా.. వారు ప్రశ్నిస్తూనే ఉంటారన్నారు. మొత్తం ప్రభుత్వాన్నే మార్చాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

## 'అమరావతి చిత్రకళా వీధి' కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసే అద్భుత వేదిక

**గుంటూరు, ఆగస్టు 8 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శని, ఆదివారాలు (ఆగస్టు 8, 9 తేదీలలో) ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటేపాడు - విద్యానగర్ రోడ్డులో అత్యంత వైభవంగా జరుగుతోన్న 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజయ్యారు. రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కీలకోపన్యాసం చేశారు. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజులు హాజరై ప్రత్యేకంగా ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.మన రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల అత్యున్నత సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 'అమరావతి చిత్రకళా వీధి' లో ప్రదర్శించిన అద్భుత కళాఖండాలు కళాకారుల గొప్పతనానికి,అనితర సాధ్యమైన ప్రతిభకు అద్దం పడుతున్నాయని కొనియాడారు. గతంలో కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించాలంటే ఆర్ట్ గ్యాలరీలోని నాలుగు గోడలకే పరిమితమయ్యే వారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ గోడలను ఛేదించి 'అమరావతి చిత్రకళా వీధి' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా కళలను బహిరంగ ప్రాంగణాల్లోకి తీసుకొచ్చి ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప అవకాశం కల్పించిందని తెలిపారు.

## కళాకారుల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం

**విజయవాడ,ఆగస్టు,08,(మనం బ్యూరో):** తెలుగు నాటక రంగానికి, ప్రాచీన పద్య నాటకాలు మరియు జానపద కళారూపాలకు పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలోని నాటక అకాడమీ నూతన సభ్యుల పదవీ బాధ్యతల స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో నూతనంగా నియమితులైన 22 మంది సభ్యులు ఈ వేదికపై బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ సభ్యులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రతీ సభ్యుడు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, తెలుగు కళా సంస్కృతిని దశదిశలా వ్యాప్తి చేయడంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తాను బాలచంద్రుడు, వీరపాండ్య కట్టబొమ్మన్న వంటి ఏకపాత్రాభినయ పాత్రలు వేశానని, కళారంగానికి సేవ చేసే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు.

# చదువయ్యాక తిరిగొచ్చేస్తం

(మొదటి పేజీ తరువాయి)

సర్వే చేశారు. ప్రతి పది మందిలో తొమ్మిది మంది వారి కుటుంబంలో విదేశాల్లో విద్యను అభ్యసించే తొలి వ్యక్తి తామేనని వెల్లడించారు. విదేశాలకు వెళ్లాలనేది తమ సొంత నిర్ణయమని దాదాపు సగం (49శాతం) మంది విద్యార్థులు చెప్పారు. మూడేళ్ల క్రితం జరిపిన సర్వేలో (2023-24లో) వీరి సంఖ్య కేవలం 29శాతంగా ఉంది. ఇటువంటి నిర్ణయాలపై కుటుంబీకుల ప్రభావం తగ్గుతూ వస్తోందని తెలుస్తోంది.చదువులు పూర్తైన తర్వాత స్వదేశానికి తిరిగి రావాలని సర్వేలో పాల్గొన్న వారిలో 81శాతం చెప్పడం గమనార్హం. సర్వేలో పాల్గొన్న ప్రతి పది మందిలో ఏడుగురు మాస్టర్స్ లేదా పీజీ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కువ మంది బిజినెస్ అండ్ మేనేజ్ మెంట్ రంగాన్ని ఎంచుకుంటుండగా.. హెల్త్ అండ్ మెడిసిన్, సైన్స్, ఇంజినీరింగ్ విభాగాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## విద్యార్థులు చెప్పేది ప్రభుత్వం వినాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనల్లో తనకు నచ్చిన మీమ్ ఏదన్న ప్రశ్నకు వ్యంగ్యంగా స్పందిస్తూ.. 'అర్ధరాత్రి ప్రధానమంత్రి నివాసం నుంచి వచ్చిన వీడియోలే ఉత్తమమైనవి. అవి ఆందోళనలో ఉన్న కొత్త ప్రధాన్ని చూపించాయి' అని చెప్పారు.

ఈ లైవ్ సెషన్లో ఆయన తన తల్లి సోనియా గాంధీ పెంపుడు కుక్క 'నూరీ'ని కూడా ప్రేక్షకులకు పరిచయం చేశారు. బీజేపీలో మీకు ఇష్టమైన నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు.. 2022లో కాంగ్రెస్ ను వీడి బీజేపీలో చేరిన పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అని తెలిపారు.

# కుటుంబ సమస్యలు స్నేహపూర్వకంగా పరిష్కరించాలి

**ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ను పరిశీలించిన ఎస్పీ సతీష్కుమార్**


**ధర్మవరం, ఆగస్టు 8, మనం న్యూస్:** కుటుంబ వివాదాలను సానుభూతితో, నిష్పాక్షికంగా పరిష్కరించి ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన మార్గాన్ని చూపాలని జిల్లా ఎస్పీ సతీష్కుమార్ సూచించారు. ధర్మవరం టౌన్ సర్కిల్ పోలీస్స్టేషన్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ను శనివారం ఆయన సందర్శించారు.కౌన్సెలింగ్కు హాజరవుతున్న ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, కుటుంబ వివాదాల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానం, కేసుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల ఫిర్యాదుల స్వభావం, వాటి పరిష్కారానికి




తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. సమస్యలను పరిష్కరించే సమయంలో ఇరు పక్షాల అభిప్రాయాలను సమగ్రంగా తెలుసుకుని, సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కౌన్సెలింగ్ కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.అనంతరం కౌన్సెలింగ్ సెంటర్లోని రికార్డులు, కేసుల పురోగతి, నిర్వహణ తీరును ఎస్పీ పరిశీలించారు. కౌన్సెలింగ్కు హాజరైన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి కుటుంబ సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు.

కుటుంబ సమస్యలు పోలీస్స్టేషన్ స్థాయిలోనే స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారమయ్యేలా కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐ రెడ్డప్ప, న్యాయవాది త్రిపుర సుందరి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు చలపతి, పాత్రికేయుడు రాఘవ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తగ్గుతున్న వీసాలు



- **భారత విద్యార్థుల 'అమెరికా డ్రీమ్'కు ఇమ్మిగ్రేషన్ కత్తెర**

**ఢిల్లీ, ఆగస్టు 8:** అమెరికాలో చదువుకోవాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. 2025 బిజీ అడ్మిషన్ సీజన్లో మన విద్యార్థులకు వీసా అనుమతులు గణనీయంగా తగ్గాయి. చైనాతో పోలిస్తే భారతీయులకు స్టూడెంట్ వీసా నిరాకరణలు దాదాపు రెట్టింపుగా ఉండటం గమనార్హం. ఈ మేరకు అమెరికాలోని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ (సీఐఎస్) అధ్యయనం వెల్లడించింది. 2025 మే-ఆగస్టు మధ్యలో అమెరికా కాన్సులేట్లు భారతీయ విద్యార్థులకు 22,149 ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు జారీ చేశాయి. 2024లోని ఇదే కాలానికి మన వాళ్లకు 58,694 విద్యార్థి వీసాలు జారీ అవ్వగా.. గతేడాది ఆ సంఖ్య 62 శాతం మేర తగ్గింది. సాధారణంగా ఏటా ఈ సీజన్లో భారతీయులకు సగటున 50వేల పైనే విద్యార్థి వీసాలు వస్తాయి. కానీ, గతేడాది ఈ సంఖ్యలో భారీ తగ్గుదల కన్పించడం ఆందోళన కలిగిస్తోంది.

**అయినా మనదే టాప్ ప్లేస్...**

మనకు విద్యార్థి వీసాల అనుమతులు భారీగా తగ్గినప్పటికీ.. అమెరికా విద్యాసంస్థల్లో నమోదు చేసుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గణాంకాల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో 3,63,019 మంది భారత విద్యార్థులు యూఎస్ కాలేజీలు, యూనివర్సిటీల్లో చేరారు.

# అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఆగస్టు 8 మనం న్యూస్:** జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, క్రమబద్ధంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఇతర జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలు, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను వెంటనే చేపట్టి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి సమన్వయ లోపం చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



హాజరుకానున్నారని తెలిపారు.జెండా ఆవిష్కరణ, సెరిమోనియల్ పరేడ్, గార్డ్ ఆఫ్ హానర్, డ్రోన్ పర్యవేక్షణ, ట్రాఫిక్ మేనేజ్మెంట్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పోలీస్ శాఖ సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. తమ తమ శాఖల పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాటు, డెకరేషన్, తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, పరిశ్రమలు, ప్రాథమిక రంగం తదితర ముఖ్య శాఖలకు సంబంధించిన శకటాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం/ప్రదర్శన నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.పతాకాలు, ఫ్లాగ్ పోల్స్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఐటీ సంబంధిత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని మీడియా కవరేజ్, సమాచార ప్రసారం, కార్యక్రమ వివరాల అందజేత తదితర ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ఫొటోగ్రఫీ, సర్టిఫికెట్ల పంపిణీ తదితర అంశాలను కూడా సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు.ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించి, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు.



## వైభవంగా ప్రారంభమైన శ్రీ కోదండరామస్వామివారి పవిత్రోత్సవాలు

### ఆగమశాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ, స్నపనతిరుమంజనం

**తిరుపతి ఆగస్టు 8 మనం న్యూస్:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి.ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు, అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల నివృత్తికి, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు.పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పవిత్ర అభిషేకం నిర్వహించారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు చేపట్టారు.

సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మంగళ విహారాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో తిలకించారు.

రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

ఆగస్టు 9న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో శ్రీమతి బి. నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జగన్, వీధిపోరాటాలతో రాజకీయ డ్రామా కట్టిపెట్టు

- కర్నూలులో డీఎస్సీ 2025 టీచర్ల ర్యాలీ చూసైనా బుద్ధి తెచ్చుకో జగన్
- రాగల ఆనంద గౌడ్

**తిరుపతి ఆగస్టు 8 మనం న్యూస్:** న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా... ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినా మెగా డీఎస్సీపై జగన్ వైఖరి పాడిందే పాటరా అన్నతీరుగా ఉంది. జగన్ మెగా డీఎస్సీ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వినియోగించుకుంటూ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ విమర్శించారు యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాడు.



నిరసన దీక్షల పేరుతో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించడం ముమ్మాటికీ వైసీపీ రాజకీయ డ్రామానే. ఆయన అన్నారు న్యాయపోరాటాలు చేయడానికి సరైన ఆధారాలు లేనందునే జగన్.. వైసీపీ నేతలు చివరకు వీధిపోరాటాలకు దిగారు. రాష్ట్ర యువత జీవితాలు బాగుపడటం.. వారికి బంగారు భవిష్యత్ లభించడం జగన్ కు ఏ కోశానా ఇష్టం లేదు. తాను అధికారంలో ఉన్నప్పుడు జాబ్ క్యాలెండర్ , మెగా డీఎస్సీ పేరుతో యువతని మోసగించిన జగన్... చివరకు గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసల్ని చేశాడు. ప్రపంచం గర్వించే ఏపీ యువత మేధస్సును, నాలుగ్గోడల్లో మగ్గిపోయేలా చేశాడు. యువతలో చైతన్యం ఉంటే... తన అవినీతి పాలన సాగదన్న దురాలోచనతోనే జగన్, వారి జీవితాల్ని మత్తులో ముంచేశాడు. నేడు కర్నూల్ లో మెగా డీఎస్సీ 2025 టీచర్ల ర్యాలీని చూసైనా బుద్ధి తెచ్చుకో జగన్ నీవు నీ పార్టీ చేసే రాజకీయ డ్రామాలు కట్టిపెట్టాలని అబద్దాలతో యువతను మభ్య పెట్టాలని వారే నీమీద తిరుగుబాటు చేయడం ఖాయమని వారు అన్నారు

డీఎస్సీలో అర్హులకు అన్యాయం జరిగిందంటున్న జగన్... వారి పక్షాన అసెంబ్లీలో మాట్లాడగలడా?₹

చంద్రబాబు, లోకేశ్ లు పెట్టుబడులు, ఉద్యోగ నోటిఫికేషన్లతో యువతకు మంచి భవిష్యత్ అందించే ఆలోచనలు చేస్తుంటే... జగన్ వారిని రాజకీయపావులుగా వాడుకోవాలని చూస్తున్నాడు. చంద్రబాబు ఏఐ, క్వాంటమ్ రంగాల్లో రాష్ట్ర యువతకు శిక్షణ అందిస్తుంటే... జగన్ వారి చేతికి గొడ్డళ్లు, కత్తులిచ్చి రప్పా రప్పా రాజకీయం చేయించేందుకు ఆరాటపడుతున్నాడు. ఆకలి, అవసరాల కోసం ఏపీ యువత ఎప్పుడూ తన మోచేతి నీళ్లు తాగుతూ, తన కింద బతకాలన్నదే జగన్ దుర్మార్గపు ఆలోచన. పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలని గగ్గోలు పెట్టడం. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్ని అడ్డుకోవడం, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారమివ్వడం వంటి జగన్ దుశ్చర్యలు దానిలో భాగమే. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో తప్పులు జరిగాయి.. అర్హులకు అన్యాయం జరిగిందని నిరూపించే ఆధారాలుంటే.. జగన్ వాటిని అసెంబ్లీలో బహిర్గతం చేయాలి. ఎంపిక చేసుకున్న మీడియా ముందు ప్రభుత్వంపై బురద జల్లకుండా.. చట్టసభలో గొంతెత్తి.. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అని ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు-2026కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- గరుడసేవ రోజు భక్తుల సురక్షిత నిష్క్రమణ ప్రణాళికపై క్షేత్రస్థాయి పరిశీలన
- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు బ్రహ్మోత్సవాల భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

**తిరుమల ఆగస్టు 8(మనం న్యూస్):** శ్రీవారి బ్రహ్మోత్సవాలు 2026ను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ మరియు బందోబస్తు ఏర్పాట్లను ముందస్తుగా పటిష్టం చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు.

ఇందులో భాగంగా తిరుమల డీఎస్పీ, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు, తిరుమల 2 టౌన్ సీఐ, ఎవిఎస్ఒ తదితర అధికారులు విజిలెన్స్ సిబ్బందితో కలిసి శనివారం తిరుమలలోని కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గరుడసేవ రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తుల రాకపోకలు సజావుగా సాగడంతో పాటు, అవసరమైన సమయంలో భక్తులను సురక్షితంగా బయటకు తరలించే విధంగా నిష్క్రమణ ప్రణాళికపై ప్రధానంగా చర్చించారు. ఇందులో భాగంగా లేపాక్షి సర్కిల్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, ఎస్ఎంసి, సుపథం, రాగిమాను జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీ నియంత్రణ, రాకపోకల నిర్వహణ, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ



మరియు అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు మరియు విజిలెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. కీలక ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రవేశ-నిష్క్రమణ మార్గాల పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలు, అవసరమైన భద్రతా చర్యలపై పోలీసు-విజిలెన్స్ అధికారులతో మరోసారి సంయుక్త సమావేశం నిర్వహించి, తదుపరి కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో అన్ని సంబంధిత విభాగాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు మరియు అత్యవసర పరిస్థితుల నిర్వహణపై సమగ్ర ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమం.. ప్రతి ఊరికి అభివృద్ధి

- ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం ఆగష్టు 8 మనం న్యూస్:** ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందుతోందని, అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అందుకే ఏ ఇంటికి వెళ్లిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి, ఆనందం కనిపిస్తోందన్నారు. రాయదుర్గం పట్టణంలో



శనివారం 15వ వార్డులో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఇంటింటికీ తెలుగుదేశం' ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో పాటు.. వారి సమస్యలను నేరుగా తెలుసుకోగలుగుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి వారు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

- విద్యాశాఖ మంత్రి లోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి, జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

**పుట్టపర్తి, ఆగస్టు 9 మనం న్యూస్:** డీఎస్సీ-2025 నియామకాల వ్యవహారంలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. రొద్దం మేజర్ పంచాయతీలో డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి రిలే నిరాహార దీక్ష మూడో రోజు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ అభ్యర్థులు, నిరుద్యోగ యువత నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్వతంత్ర సంస్థ అయిన సీబీఐతో నిష్పక్షపాత విచారణ జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఉషశ్రీ చరణ్ అన్నారు. విచారణకు ముందే ఎవరినీ దోషిగా తేల్చడం తమ ఉద్దేశం కాదని, అయితే ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగి నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి చదివి, కోచింగ్ తీసుకుని, కుటుంబాలకు దూరంగా కష్టపడ్డ నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీయడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడిన నియామక ప్రక్రియపై అనుమానాలు తలెత్తినప్పుడు ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సింది పోయి సమస్యను నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు.విద్యాశాఖకు మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తున్నందున, డీఎస్సీ వ్యవహారంపై వచ్చిన




ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియపై ఇంతటి ఆరోపణలు వస్తున్నా బాధ్యత వహించకుండా తప్పించుకోవడం ఎందుకు? నిరుద్యోగుల ప్రశ్నలకు ప్రభుత్వం ఎప్పుడు సమాధానం చెబుతుంది? అని ప్రశ్నించారు.

రాజకీయ విమర్శలు, ఆరోపణలకు అతీతంగా డీఎస్సీ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని, బాధ్యత వహించే స్థాయిలో ఉన్న మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగ భృతితో పాటు యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని కోరారు.ఉద్యోగం కోసం చదివిన యువతకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు, ఆరోపణలపై సమగ్ర విచారణ పూర్తయ్యే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది. యువత గొంతుకగా నిలిచి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తా మని ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు.ఈ రిలే నిరాహార దీక్షకు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, వైసీపీ యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.

## ఆదివాసి దినోత్సవం రోజున గిరిజన యువకుని జీవితంలో కొత్త వెలుగులు

### జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబానికి మళ్లీ ఉపాధి బాట చూపిన రోజా చారిటబుల్ ట్రస్ట్

**నగరి, ఆగస్టు 8 మనం న్యూస్:** ఒకప్పుడు ఆ ఆటోనే ఆ గిరిజన యువకుడి కుటుంబానికి జీవనాధారం... కానీ రాజకీయ కక్ష సాధింపుతో ఆ ఆటో అగ్నికి ఆహుతి కావడంతో ఒక్కసారిగా అతని బతుకు బండి ఆగిపోయింది. ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న పుత్తూరుకు చెందిన గిరిజన యువకుడు రాజాకు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఆర్కే రోజా మానవీయ హృదయంతో అండగా నిలిచారు. రాజా కష్టాలను తెలుసుకున్న రోజా శనివారం తన నివాస కార్యాలయంలో నిర్వహించిన ఆదివాసి దినోత్సవం లో తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొత్త ఆటోను వితరణగా అందించారు. దీంతో కేవలం ఒక వాహనాన్ని అందించడమే కాకుండా, ఉపాధిని కోల్పోయిన ఓ గిరిజన యువకుడికి తిరిగి జీవనాధారాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తుపై భరోసాను అందించారు.

ఉపాధిని కోల్పోయి కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్న రాజాకు ఆటో అందడంతో అతని ముఖంలో చిరునవ్వు కనిపించింది. తన కాళ్లపై తాను నిలబడి కుటుంబాన్ని పోషించుకునేందుకు మరోసారి అవకాశం లభించింది. ఈ సందర్భంగా రాజా కుటుంబ సభ్యులు రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారం ఉన్నప్పుడు సహాయం చేయడం కంటే... అధికారం లేని సమయంలోనూ బాధితుడి కన్నీటిని



తుడవడం గొప్ప మానవత్వం అని స్థానికులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలన్న రోజా చారిటబుల్ ట్రస్ట్ సేవా దృక్పథానికి ఈ ఘటన నిదర్శనమని కొనియాడారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఒక గిరిజన యువకుడి చేతికి ఆటో తాళాలు అందించడం ద్వారా రోజా అతనికి వాహనం మాత్రమే ఇవ్వలేదు... ఆగిపోయిన అతని జీవన ప్రయాణానికి మళ్లీ చక్రాలు తిప్పారు.

## సీసీ హరి ఆధ్వర్యంలో బోనాల కరపత్రం విడుదల

### వైభవంగా చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు నిర్వహిస్తాం


**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్:** జగన్మాత సృష్టికర్త ప్రపంచ మానవాళికి కొంగు బంగారమై విరాజిల్లు శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను అంగరంగ



వైభవంగా నిర్వహిస్తామని తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు, మాస్టర్ వీవర్ సిసి హరి పేర్కొన్నారు. సుమారు 1500 బోనాలతో కనుల పండుగగా అమ్మవారి బోనాల జాతర జరగనుంది. ఈ సందర్భంగా శనివారం సోమందేపల్లి లోని చౌడేశ్వరి కల్యాణ మండపం లో కుల బాంధవుల సమావేశాన్ని నిర్వహించారు. బోనాలకు సంబందించిన పంప్లెట్ ని తోగటవీర క్షత్రీయ సంఘం అధ్యక్షులు సీసీ హరి సమక్షంలో జ్యోతి సంఘం అధ్యక్షులు బండారు శీనా బోనాలకు సంబందించిన పంప్లెట్ ని విడుదల చేసారు.ఈ సందర్భంగాసీసీ హరి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాడ శుద్ధ అమావాస్య రోజున చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తెలంగాణ తరహాలో అమ్మవారికి బోనాలను సమర్పిస్తామని, ముఖ్యంగా యువతులు చిన్నారులు అమ్మవారి బోనాలు తలపై ధరించి గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించడం జరుగుతుందన్నారు.

## ప్రతిభను అవమానించడం తగదు

**రావుయదుర్గం ఆగష్టు 8 మనం న్యూస్:** ప్రతిభ ఆధారంగా 2025- డీఎస్సీ. లో నియమితులైన ఉపాధ్యాయులపై జరుగుతున్న అసత్య ఆరోపణలను, దాని వెనుక ఉన్న రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నిజాన్ని ప్రజలకు వివరించేందుకు పోరాడుతున్న డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని కోరారు. కర్నూలులో డీఎస్సీ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సంఘీభావ ర్యాలీలో పాల్గొనేందుకు రాయదుర్గం నుంచి బయలుదేరిన ఉపాధ్యాయుల వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారిని కావాలనే అవమానించేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభను నిరూపించుకుని ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై నిందారోపణలు చేయడం, వారి ప్రతిభను ప్రశ్నించడం సమంజసం కాదన్నారు. కేవలం 230 రోజుల్లోనే 180కి పైగా న్యాయపరమైన కేసులను ఎదుర్కొని, మెగా డీఎస్సీ-2025 ద్వారా 16,376 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన నియామక ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారిని రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమన్నారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 2025 డీఎస్సీ ఉపాధ్యాయులు కర్నూలులో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించే ఈ ఐక్యతా కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు తమపై జరుగుతున్న దుష్ప్రచారానికి గట్టి సమాధానం ఇవ్వబోతున్నారన్నారు. నిజం గడప దాటేలోపే అసత్యం ఊరంతా తిరిగి వస్తుంది అన్న సామెతను గుర్తుచేస్తూ.. అసత్య ప్రచారం ఎంత విస్తృతంగా జరిగినా చివరకు నిజమే గెలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సత్యాన్ని, నిజాన్ని కోరుకునే వారందరూ వారికి భరోసాగా నిలవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని




కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, మేధావులు సంఘీభావం ప్రకటించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి అగ్రహారం కిరణ్, రిటైర్డ్ ఎమ్.ఈ.ఓ వెంకట రమేష్ ,ఉపాధ్యాలులు పాల్గొన్నారు.

## అసంపూర్తి...

ప్రేమే ఎందుకని నన్ను
పదే పదే అడుగకు ప్రియా...
ఊపిరికి ప్రత్యామ్నాయం
చూపించి అప్పుడడగు నన్ను
క్షతగాత్రుని
మనసులాంటిదిప్పుడు
నా హృదయం
గాయం మానేదాక
పుండు మీదనే ద్యాసున్నట్టు
నా పానమంతా నీ మీదనే
కొట్టుకుంటున్నది
నాకు నీపై ప్రేమేంత అని కూడా
మాటిమాటికి భలికించకు సఖి
ఆకాశపు కొలతేంతో చెప్పి
అప్పుడడుగు నన్ను
నీవిప్పుడు నాకు  నేనే చేసుకున్న
గుండెమీది పుండువి
పుండు మానుతుందేమో
కానీ బర్ర మానదన్నట్టు
నీవుండకపోవచ్చు కానీ
నీ జ్ఞాపకం
ఎప్పటికీ మలగనిది
అసంపూర్ణమైనదేదైనా
భూమి మీదున్నదంటే
కోరిక, సుఖం, ప్రేమ మాత్రమే.

**- దిలీప్.వి**
8464030808

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# పుస్తకం గుప్పిట ప్రపంచం

పుస్తకం అనేది కేవలం కాగితపు పుటల సమాహారమే గాక, అది మానవ చైతన్యానికి, మేధస్సుకు, సంస్కృతికి ప్రతిబింబం. ఇది భావనలకు పరిమితం కాకుండా, విస్తృతంగా విరాజిల్లే మానసిక పరిపక్వతకు మార్గదర్శి. జ్ఞానాన్ని అక్షరాల్లో బంధించిన మహాత్మ్యం పుస్తకానికి మాత్రమే చెల్లుతుంది. చదివే ప్రతి పుట ఒక కొత్త లోకాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ భావోద్వేగ, విజ్ఞాన మార్గదర్శి పుస్తకాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం జరుపు కుంటారు. పుస్తకాన్ని ప్రేమించడమంటే జీవితం పట్ల ప్రేమను పొందడమే. పఠనాన్ని అలవాటు చేసుకోవడం అంటే మనుషుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే ఆత్మ కాంక్ష.

ఈ దినోత్సవాన్ని ఎవరు ప్రారంభించారన్న దానిపై స్పష్టత లేకున్నా, ఈ రోజు ఉద్దేశం మాత్రం అపారంగా ఉంది. పఠన సంస్కృతిని నిలబెట్టడం, ముద్రిత పుస్తకాల విలువను గుర్తు చేయడం, చదవడం అనే నిర్జీవంగా మారుతున్న మానవ గుణాన్ని మళ్లీ జీవింప జేయడం ఈ దినోత్సవ ప్రయోజనంగా భావించాలి. డిజిటల్ యుగంలో చదువులు తెరవెనుక సెల్‌ఫోన్ తెరలకే పరిమితమై పోతున్న తరుణంలో, ముద్రిత పుస్తకాలను మళ్లీ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నంగా ఈ దినోత్సవాన్ని చూసుకోవాలి. చదవడం అనేది వ్యక్తిగత సాధన అయినప్పటికీ, సమాజ నిర్మాణంలో దీని పాత్ర అమూల్యం. చదివిన ప్రతి వ్యక్తి ఆలోచించ గలడు. ఆలోచన చేసిన ప్రతి ఒక్కరూ మార్పును ఆవిష్కరించ గలరు. మార్పే మానవ అభివృద్ధికి పునాది.

చదవడం అనేది చింతనకు మూలం. అది ఊహకు ఊతమందించే వ్యవస్థ. ఒక్క పుస్తకం మనిషి జీవితాన్ని దిద్దుబాటు చేయగలదు. చదవడం ద్వారా వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు. శ్రద్ధ, ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ, భాషా పటిమ, వివేచన, నిశ్చలత- ఇవన్నీ చదివే అలవాటుతోనే వస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి నుంచే చదివే అలవాటు పెంచితే, పిల్లలలో మేధో వికాసం, భావ ప్రకటన సామర్థ్యం, అపూర్వ ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతాయి. చదివే పుస్తకం ఓ లోక



దర్శనం, చదివిన పుటలు అనుభవాల చరిత్ర.

భారతదేశం ప్రపంచానికి శబ్ద బ్రహ్మగా మారిన దేశం. ఇది శ్రుతి సంప్రదాయానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, గృహసూత్రాలు, స్మృతులు మొదలెన అనేక పాఠ్య సంపదలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తాళ పత్రాలపై రాయడం మొదలై, అక్షరాల రూపంలో జ్ఞానం ముద్రించ బడింది. మనకున్న ప్రాచీన పుస్తక సంపద ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసే స్థాయిలో ఉంది. వేదాలలో విజ్ఞానం, వ్యాకరణ, ఛందస్సు, సాహిత్యగ్రంథాలు, చాణక్య అర్థ శాస్త్రం,శాస్త్రీయ దర్శనాలలో ఉపనిషత్తుల లోతు, మహాభారత రామాయణాల అఖండత, పురాణాల పురాతనత - ఇవన్నీ పుస్తక రూపాల్లో మానవ చైతన్యానికి అక్షర ప్రతిరూపాలు.

తెలుగు సాహిత్యంలో కూడా అనేక అపురూప గ్రంథ సంపద ఉంది. నన్నయ్య భావార్థంగా ముద్రించిన మహాభారతం, తిక్కన్న సాహిత్యం, పోతన భాగవతం, వేమన పద్యాలు, వివిధ శతకాలు, తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగయ్య కీర్తనలు- ఇవన్నీ కేవలం భక్తి భావనకే కాదు, భాషా శిల్పానికి, పాఠ్య పరంపరలకు చక్కటి ఉదాహరణలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, మల్లాది, శ్రీశ్రీ, కందుకూరి, గురజాడ, ఆరుద్ర, వట్టికోట, యండమూరి, జంధ్యాల, రచయిత్రులు - అనేక రచయితలు తమ రచనలతో పాఠకులను తాకిన తీరు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంకల్ప భరితమైన రచనలు పఠనానికి ప్రేరణగా నిలిచాయి. పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు లెక్క లేనివి. పుస్తకం మనకు నూతన భావనలు అందిస్తుంది, ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది, భాషలో మాధుర్యాన్ని పెంచుతుంది, లోతైన ఆలోచనకు అవకాశాన్ని ఇస్తుంది. ముఖ్యంగా ఊహ శక్తిని ప్రేరేపించి, మనలోని సృజనాత్మకతను మేల్కొలిపే సాధన పుస్తకం. చదవడం అనేది మానసిక దృష్టి కోణాన్ని శుద్ధి చేస్తుంది. అది మనల్ని మెదడుతో, మనస్సుతో, కలుపుతుంది. ఇది యాంత్రికతను అధిగమించి ఆలోచనను పురిగొలిపే ప్రక్రియ.

ఈ దినోత్సవాన్ని వ్యక్తిగతంగా జరుపుకోవడం కన్నా సామూహికంగా జరుపుకుంటే అధిక ప్రయోజనం. పాఠశాలలలో పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు, గ్రంథాలయాల సందర్శనలు, పుస్తకాల చర్చలు, రచయితల ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు సమాజాన్ని పఠన పట్ల ఆకర్షించ గలవు. ఇంట్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా వారికి చదవడం పట్ల ఆసక్తి కలిగించ వచ్చు. పాత పుస్తకాలను పాఠశాలలకు, స్వచ్ఛంద సంస్థలకు దానం చేయడం వల్ల పఠన వనరులు పెరుగుతాయి. ఈ దినోత్సవం రోజున ఒక్క మంచి పుస్తకాన్ని పరిచయం చేయడం కూడా సమాజ మార్పుకు పునాది వేయగలదు. చదవడమంటే కేవలం గడిపిన సమయం కాదు, అది మనిషిగా మనలో పెరిగిన క్షణం. ఒక పుస్తకం మన జీవితాన్ని మార్చ గలదు. మనం మారితే సమాజం మారుతుంది. అందుకే పుస్తకాన్ని ప్రేమించాలి, పఠనాన్ని అభివృద్ధి పరచాలి, పుస్తక ప్రేమికుల దినోత్సవాన్ని జ్ఞానోత్సవంగా మార్చాలి. మానవ వికాసానికి పుస్తకం కీర్తి పతాక. జీవితాన్ని నిర్మించుకునే మార్గంలో పఠనం మనకు తోడుగా ఉండే కాంతి రేఖ. జ్ఞానం మాత్రమే నిజమైన శక్తి. ఆ శక్తిని మన చేతుల్లోకి తేవాలంటే పుస్తకాన్ని ఒడిసిపట్టాలి. చదవడమే మార్గం, పుస్తకమే సాధనం.

**ఆగస్టు 9...జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# స్వేచ్ఛ కోసం.. క్విట్ ఇండియా



చరిత్రలో కొన్ని ఉద్యమాలు ప్రభుత్వాలను సవాలు చేయడమే కాదు, ఒక జాతిని జాగృతం చేస్తాయి. 1942 ఆగస్టు 9న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం అలాంటిదే. ఇది ఒక్క రోజులో పుట్టిన ఆవేశం కాదు, తొంభై ఏళ్ల జాతీయ చైతన్యం, త్యాగాల పరంపర పరిణామం. 1857 సిపాయిల తిరుగుబాటుతో మొదలైన స్వేచ్ఛా జ్వాల, 1885 కాంగ్రెస్ స్థాపనతో ఒక దశ,దిశ పొంది, తిలక్, లజపత్ రాయ్, బిపిన్ చంద్ర పాల్ వంటి నాయకుల నినాదాలతో ఉవ్వెత్తున ఎగసింది. గాంధీజీ నేతృత్వంలోని అసహకార, శాసనోల్లంఘన ఉద్యమాలు స్వాతంత్ర్య కాంక్షను గ్రామగ్రామానికీ చేర్చాయి.

1939లో రెండో ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు, భారత ప్రజలను సంప్రదించకుండానే బ్రిటిష్ ప్రభుత్వం దేశాన్ని యుద్ధంలోకి లాగింది. వేలాది సైనికులు ప్రాణాలు కోల్పోయారు, వనరులు దోచుకోబడ్డాయి కానీ స్వాతంత్ర్యంపై ఒక్క హామీ కూడా లభించలేదు. 1942లో వచ్చిన క్రిప్స్ మిషన్ కూడా నిజమైన అధికార బదిలీని ప్రతిపాదించకపోవడంతో, బ్రిటిష్ పాలన స్వచ్ఛందంగా స్వాతంత్ర్యం ఇవ్వదన్న సత్యం భారతీయులకు మరింత స్పష్టమైంది.ఈ నేపథ్యంలో గాంధీజీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలోని గోవాలియా ట్యాంక్ మైదానంలో క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించబడింది. అదే వేదికపై గాంధీజీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు యువతరాన్ని ఉర్రూతలూగించింది. ఇది హింసకు పిలుపు కాదు, అహింసా మార్గంలో ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలన్న నైతిక ఆదేశం. మరుసటి రోజే గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్ వంటి ప్రధాన నాయకులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. నాయకత్వాన్ని బంధిస్తే ఉద్యమం ఆగిపోతుందని వారు భావించారు. కానీ చరిత్ర దీనికి విరుద్ధంగా మలుపు తిరిగింది. నాయకులు జైలులో ఉన్నా, సామాన్య ప్రజలే ఉద్యమ నాయకత్వాన్ని చేపట్టారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు అందరూ ఒక్కటై ఉద్యమంలో దూకారు. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాన్ని ఉధృతం చేశారు.

ఈ ఉద్యమానికి కేంద్రీకృత నాయకత్వం లేకపోవడమే దాని అసలైన శక్తిగా మారింది. బ్రిటిష్ ప్రభుత్వం నాయకులను నిర్బంధించగలిగింది, కానీ ఒక జాతి స్వేచ్ఛా సంకల్పాన్ని బంధించలేక పోయింది. జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా వంటి యువ సోషలిస్టు నాయకులు రహస్య నెట్‌వర్క్‌ల ద్వారా ఉద్యమాన్ని నడిపారు. ఉషా మెహతా నిర్వహించిన రహస్య 'కాంగ్రెస్ రేడియో' సెన్సార్‌ను ఛేదించి దేశ వ్యాప్తంగా స్వేచ్ఛా సందేశాలు ప్రసారం చేసింది. అరుణా ఆసఫ్ అలీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి చరిత్రలో నిలిచిపోగా, పశ్చిమబెంగాల్లో మాతంగిని హాజ్రా జాతీయ జెండాను చేతబూని పోలీసు కాల్పుల్లో ప్రాణత్యాగం చేశారు. స్వేచ్ఛ కోసం భయం లేకుండా నిలబడే తత్వం, మహిళా నాయకత్వ పటిమ, నేటి యువతకు స్ఫూర్తిదాయకమైన పాఠం .

తెలంగాణ అప్పట్లో నిజాం రాజ్యంలో ఉన్నా, ఉద్యమ ప్రభావం ఇక్కడా స్పష్టంగా కనిపించింది. స్వామి రామానంద తీర్థ, డా. మెల్కోటే, కాళోజీ నారాయణరావు, వందేమాతరం రామచంద్ర రావు, బూర్గుల రామకృష్ణారావు వంటి నాయకులు ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, ప్రజా మండళ్లు నిజాం నిర్బంధాల మధ్య కూడా జాతీయోద్యమ జ్వాలను కొనసాగించాయి. ఇది తర్వాతి హైదరాబాద్ విమోచన ఉద్యమానికి పునాదిగా నిలిచింది.

1943-45 మధ్య సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆగ్నేయాసియాలో సాయుధ పోరాటాన్ని కొనసాగించింది. 1945లో బ్రిటన్‌లో క్లెమెంట్ ఆట్లీ ఆధ్వర్యంలో లేబర్ పార్టీ అధికారంలోకి రావడం, 1946లో రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు బ్రిటిష్ పాలకులను కుదిపేశాయి. చివరకు 1947 ఫిబ్రవరిలో అధికార బదిలీ ప్రకటన వెలువడి, ఆగస్టు 15న భారత్ స్వతంత్ర దేశంగా అవతరించింది. చరిత్రకారులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్వాతంత్ర్యానికి ముందుమాటగా అభివర్ణిస్తారు.

క్విట్ ఇండియా ఉద్యమం మనకు నేర్పిన గొప్ప పాఠం, నాయకత్వం లేకపోయినా, సాధారణ ప్రజలే మార్పుకు అసలైన శక్తి కాగలరు. అప్పటి యువత తమ ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టి దేశం కోసం నిలబడింది. నేటి యువతకు బాధ్యత అలాగే ఉంది. అవినీతిపై పోరాటం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమాజంలో సమానత్వం కోసం నిలబడటం ఇవన్నీ నేటి 'క్విట్ ఇండియా' రూపాలే.

స్వేచ్ఛ అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు, అది ప్రతిరోజూ న్యాయం, సత్యం, సమానత్వం కోసం నిలబడే సంకల్పం. గాంధీజీ 'డూ ఆర్ డై' నినాదం నేటికీ మనకు గుర్తుచేసేది ఒక్కటే. లక్ష్యం సరైనదైతే, భయం అడ్డురా కూడదు. చరిత్రను మార్చేది ఆయుధాలు కాదు, సంకల్పంతో నిలిచే ప్రజలు. ఈ ఆగస్టు 9న, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రతి యువకుడు తన వంతుగా దేశనిర్మాణంలో బాధ్యతాయుతంగా నిలబడాలి. అదే అమరవీరుల త్యాగానికి నిజమైన నివాళి.



**- గిలకత్తుల వెంకటరమణ గౌడ్**
9866878769

# ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప




ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని సమగ్రంగా ప్రతిబింబించే జక్కని వెంకట రాజం రచించిన చెన్నపార్యశతకం ఆవిష్కరణ 2026 ఆగస్టు 9న జరగడం తెలుగు సాహిత్య వర్గాలకు విశిష్టమైన సందర్భంగా నిలుస్తోంది. ఆచార్య చెన్నప్ప చేసిన బహుముఖ సేవలను శతక రూపంలో సాహిత్యీకరించడం ఈ గ్రంథ ప్రత్యేకత. అక్షరసేవను సమాజసేవతో, సంస్క ృతిని ఆధ్యాత్మిక చైతన్యంతో అనుసంధానించిన ఆయన జీవన ప్రయాణానికి ఈ చెన్నపార్యశతకం ఒక సాహిత్య గౌరవ నివేదనగా చిరస్థాయిగా నిలిచే కృతిగా భావించవచ్చు.

ఒక అధ్యాపకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, పరిశోధకుడిగా విస్తరించి, సాహితీవేత్తగా పరిపక్వమై, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్ష స్థాయికి ఎదిగింది. తెలుగు భాషా సంస్క ృతుల పట్ల ఉన్న నిబద్ధత, పరిశోధన పట్ల ఉన్న క్రమశిక్షణ, సమాజంతో మమేకమైన సాహిత్య దృష్టి కలిసిన ఒక సజీవ సాహిత్య ప్రస్థానం.

1955 ఫిబ్రవరి 8న మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం రంగారెడ్డి ప్రాంతంతో అనుబంధంగా గుర్తించబడే ప్రాంతీయ నేపథ్యం)లోని కొల్లూర్ ఎల్లి గ్రామంలో జన్మించిన ఆచార్య చెన్నప్ప సాధారణ కుటుంబంలో జన్మించారు. సుమారు నాలుగు దశాబ్దాలకుపైగా సాగిన ఆయన బోధనా సేవ విశేషమైనది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుండి ప్రభుత్వ డిగ్రీ కళా శాలల వరకు, అక్కడి నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు విస్తరించిన ఈ ప్రయాణంలో వేలాది మంది విద్యార్థులు ఆయన బోధన ద్వారా ప్రభావితులయ్యారు. తెలుగు బోధనను కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో ఉంచకుండా ప్రజానుభవాలతో అనుసంధానించడం ఆయన ప్రత్యేకత. చదవాలనే ఆసక్తిని, ప్రశ్నించాలనే ధైర్యాన్ని, పరిశోధన చేయాలనే తపనను పెంపొందించిన గురువుగా ఆయనకు ఉన్న పేరు విశిష్టమైనది. మసన చెన్నప్ప సాహిత్య సృజన వైవిధ్య భరితమైనది. పద్యకవిత్వం, వచనకవిత్వం, సాహిత్య వ్యాసాలు, విమర్శ, పరిశోధన, అనువాద ధోరణులు- ఇలా అనేక ప్రక్రియల్లో ఆయన తన ముద్రవేశారు. నేత్రోదయం, సమాలోచనం, ప్రత్యూష, ఆ సంధ్య, వేలు-మేలాలు,ఉపన్యాసాలు- వ్యాసాలు,తెలంగాణ తెలుగులు వంటి రచనలు ఆయన సాహిత్య దృష్టి విస్తృతిని తెలియ జేస్తాయి. ఈ రచనల్లో సమాజాన్ని పరిశీలించే విశ్లేషణాత్మక దృష్టి, భాషా సంస్కృతులపట్ల ఉన్న ప్రేమ, ప్రాంతీయ అనుభవాలను సాహిత్యంగా మలిచే సామర్థ్యం కనిపిస్తాయి. తెలంగాణ భాషా వైవిధ్యంపై ఆయన చేసిన కృషి ప్రస్తావనీయమైనది. తెలంగాణ తెలుగును తక్కువచేసే ధోరణులు ఉన్న కాలంలో, దాని సాంస్కృతిక గౌరవాన్ని, భాషా వైశిష్ట్యాన్ని, ప్రజల జీవనానుభవాలను సాహిత్య చర్చలోకి తీసుకు రావడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది. తెలం గాణ మాండలికాలు, ప్రజాపదాలు, స్థానిక భావ వ్యక్తీకరణలు కూడా సాహిత్యానికి సముచితమైనవేనని ఆయన రచనలు బలంగా ప్రతిపాదించాయి. పరిశోధకుడిగా ఆయన సేవలు మరింత విశాలమైనవి. అనేక మంది ఎం.ఫిల్, పీహెచ్.డి. పరిశోధకులకు మార్గనిర్దేశనం చేయడం ద్వారా ఆయన తనదైన ఒక పాఠశాలగా నిర్మించారు. పరిశోధన అంటే మూలగ్రంథాల అధ్యయనం, సందర్భ అవగాహన, స్వతంత్ర ఆలోచన, శాస్త్రీయ నిష్పాక్షికత అవసరమని ఆయన తన శిష్యులకు నేర్పారు. చెన్నప్ప కృషికి అనేక పురస్కారాలు, సత్కారాలు లభించాయి. గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ నుండి తెలంగాణ ప్రతిభా పురస్కారం వరకు, సాహిత్య సంస్థల నుండి విద్యాసంస్థల వరకు ఆయనకు లభించిన గౌరవాలు వ్యక్తిగత ప్రతిష్ఠకు మాత్రమే కాక, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవకు దక్కిన గౌరవంగా భావించాలి. ఆయన వ్యక్తిత్వంలో అత్యంత ముఖ్యమైన అంశం వినయం. విశ్వవిద్యాలయ స్థాయి గౌరవాలు, పరిశోధనా ప్రఖ్యాతి, సాహిత్య ఖ్యాతి ఉన్నప్పటికీ ప్రజలతో మమేకమయ్యే సరళతను ఆయన కోల్పోలేదు. గ్రామజీవితం, సామాన్యుల అనుభవాలు, విద్యార్థుల సమస్యలు, భాషా గౌరవం-ఈ అంశాలు ఆయన ఆలోచనలో ఎప్పుడూ కేంద్రస్థానంలో నిలిచాయి. సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రదానం చేసిన సత్కార పత్రంలో ఆచార్య మసన చెన్నప్పను తెలుగు సాహిత్యానికి, ఉపన్యాస సంప్రదాయానికి, పరిశోధనకు విశిష్ట సేవలందించిన ప్రముఖ సాహితీవేత్తగా అభివర్ణించారు.

ఆర్షకవిగా ఉపనిషత్ పరిశోధకుడిగా ప్రసిద్ధి పొందిన మసన చెన్నప్ప ఆరువేల ముత్యాల సరాల్లో ఉపనిషత్ జ్ఞానాన్ని అందించారు.




**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

## చిన్న కవితలు

చెట్టును
కదిపితేనే తెలిసింది
ఇక్కడ వానపడిందని

కొంతవానను
దాచిపెట్టుకుంటుంది చెట్టు
తన కిందికెళ్లినవారికోసం

మట్టిలో కలవమంటే
కలవమని చెట్టుకు వేలాడు
తున్నాయి
ఎంత పిచ్చివో వాన
చినుకులు
అప్పుడప్పుడూ వానే
రోడ్డుపక్క దుమ్ము
కొట్టుకుపోయిన

చెట్లూ, మనుషుల కోసం
అక్షరాలు దిద్దమంటే
సున్నాలు చుడుతోంది
చెరువు పలకపై వాన
గుండెను
కాస్త పెద్దది చేసుకుని

ఇద్దరికి చోటిచ్చింది
గొడుగు
గొడుగులో ఇచ్చింది
గుండెలో చోటిచ్చినంత
ఫీలింగు
వీధి వీధంతా
నల్లమొగ్గలు వికసించాయి
వాన పెద్దదైంది

పెద్దలు
పిల్లలయ్యారు
వానలో తడుస్తూ
గొడుగు కిందికి చేరాలా
వద్దానే ఆమె సంశయాన్ని
ఉరుము తీర్చింది

**- చిత్తలూరి**
9133832246

# సకల పాప హారిణి...కామిక ఏకాదశి

పరమ పవిత్రమైనది, పుణ్య ప్రధానమైనది ఆషాఢ మాసంలో కృష్ణ పక్ష ఏకాదశి. దీనిని 'కామిక ఏకాదశి'గా జరుపుకుంటారు. ఈ ఏకాదశికి పేరుకు తగినట్లే మనసులోని కోరికలను సిద్ధింపచేసే శక్తి ఉందని భావిస్తారు. కామిక ఏకాదశి రోజున శ్రీహరిని ఆరాధిస్తే వచ్చే పుణ్యఫలం కాశీలో గంగ స్నానం కన్నా, హిమాలయాలలో ఉండే కేదారనాథుని దర్శనం కన్నా, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో ఆచరించే స్నానం కన్నా, సమస్త భూమండలాన్ని దానం చేసిన దానికన్నా, గురు గ్రహం సింహ రాశిలో ఉన్న పౌర్ణమి రోజు సోమ వారం, గోదావరి నదిలో పుణ్య స్నానం చేస్తే వచ్చే పుణ్యఫలం కన్నా ఎక్కువ. శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లిన నాలుగు నెలల కాలంలో వచ్చే తొలి ఏకాదశి కావటంతో దీనిని విశేషంగా పరిగణిస్తారు.

ధర్మవర్తనుడైన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణున్ని ' ఆషాఢ మాసములో కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశి మహిమలను గురించి వివరించమని' కోరగా, దానికి ఆ వాసుదేవుడు, ఏకాదశి యొక్క మహిమలను వివరించటం జరిగింది. నారద మునీంద్రుడు తన తండ్రి బ్రహ్మ దేవుడిని 'ఆషాఢ కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశిని గురించి వివరించమని కోరగా దానికి బ్రహ్మ బదులిస్తూ ఆషాఢ కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అంటారని ఈ ఏకాదశి మహిమ విన్నంతనే అశ్వమేధ యాగఫలం లభిస్తుందని, శంఖ, చక్రగదాధరుడు, తామర పాదములు కలిగి ఉన్నవాడు శ్రీధరుడు, హరి, విష్ణు, మాధవుడు, మధు సూధనుడు అనే పేర్లతో పిలవబడేవాడు అని.. శ్రీ మహావిష్ణువును కామిక ఏకాదశి రోజు ఆరాధిస్తారని వివరించి నట్లు పురాణ కథనం. కామిక ఏకాదశి రోజు పాలు ఇచ్చే గోవును, దూడ మరియు గ్రాసములతో కలిపి దానం చేయటం వలన సమస్త దేవతల ఆశీర్వాదం పొందుతారని, గతములో చేసిన పాపములకు భయపడేవారు, పాపమయమైన జీవితంలో కూరుకపోయినవారు ఏకాదశి వ్రతమాచరించి మోక్షమును పొందవచ్చునని బ్రహ్మ వివరించి నాట్లు పేర్కొన బడింది.

కామిక ఏకాదశి రోజు ఉపవసించిన వారు, సమస్త ఆధ్యాత్మిక సాహిత్యాలను అధ్యయనం చేసిన వారి కన్నా గొప్పవారని,' ఈ రోజు రాత్రి ఆధ్యాత్మికంగా జాగరణం చేసిన వారు ఎప్పుడూ యమధర్మరాజు కోపానికి గురికారని, ఈ వ్రతం ఆచరించిన వారు భవిష్యత్తులో మళ్ళీ జన్మనెత్తే అవసరం ఉండక మోక్షమును పొందుతారని స్వయంగా మహా విష్ణువే చెప్పినట్లు బ్రహ్మ వివరణ. కనుక ఈ ఏకాదశిని ప్రత్యేక శ్రద్ధతో ఆచరించాలి. కామిక ఏకాదశి రోజున తులసి ఆకులతో విష్ణువును ఆరాధించేవారు, అన్ని పాపముల నుండి విముక్తి పొందుతారు. తామరాకును నీటి బొట్టు అంటనట్లే వారిని కూడా పాపము అంటదు.

ఒక్క తులసి ఆకుతో ఆరాధించటం వలన వచ్చే పుణ్యము, బంగారం, వెండి దానం చేస్తే వచ్చే దాని కన్నా ఎక్కువ. తులసి ఆకుతో ఆరాధిస్తే శ్రీహరి, ముత్యాలు, కెంపులు, పుష్పరాగములు , వజ్రాలు, నీలం మరియు గోమధికములతో పూజించిన దానికన్నా ఎక్కువ సంతోషిస్తాడు. లేత తులసి ఆకులతో చేసే ఆరాధన గత జన్మ పాపాలను కూడా తొలగించి వేస్తుంది. కామిక ఏకాదశి రోజున తులసి మొక్కను ఆరాధిస్తే కూడా పాపములు తొలగి పోతాయి. తులసిని నేతి దీపంతో ఆరాధించే వాళ్ల పాపములను చిత్రగుప్తుడు లెక్కలోకి తీసుకోడు. ఈ రోజున శ్రీకృష్ణుని నువ్వుల మరియు నేతి దీపములతో ఆరాధిస్తారో, వారు శాశ్వతముగా సూర్యలోకములో నివసించే అర్హత కలిగి ఉంటారు. కామిక ఏకాదశికి బ్రహ్మ హత్యా పాతకాన్ని, భ్రూణ హత్యా పాపమును కూడా తొలగించే శక్తి ఉంది అని బ్రహ్మ నారదునికి వివరించినట్లు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో చెప్పినట్లుగా పురాణ ఆధారం. కామిక ఏకాదశి రోజున తులసీ దళాలతో విష్ణుమూర్తిని పూజించడం ద్వారా సకల సంతోషాలు చేకూరుతాయి. తులసీ దళాలతో పూజ చేయడం ద్వారా అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయి. శత్రుబాధ, ఈతిబాధలు, ఆర్థిక ఇబ్బందులు తొలగి పోతాయి. ఒక తులసీ దళం.. నవరత్నాలు, వజ్ర వైఢూర్యాలు, స్వర్ణం, వెండి కంటే అతీతమైందని పురాణాలు చెబుతున్నాయి. కామిక ఏకాదశిన సూర్యోదయానికి ముందే లేచి శుచిగా స్నానమాచరించి విష్ణుపూజ, తులసీ పూజ చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పౌరాణికులు చెబుతున్నారు. ఆ రోజున శ్రీ కృష్ణుడిని నిష్ఠగా పూజించి నువ్వుల నూనె లేదా నెయ్యితో



దీపమెలిగిస్తే.. ఆ పరమాత్మ ఆశించిన ఫలితాలనిస్తాడని, పాపాలను హరింపజేసి, స్వర్గలోకవాస ప్రాప్తం ప్రసాదిస్తాడని పండితులు చెపుతున్నారు.

**- ఆర్‌కేఎస్**

# రిషికొండ శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న హోం మంత్రి అనిత



విశాఖపట్నం, ఆగస్టు 8(మనం న్యూస్): రిషికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోం మంత్రి అనితకు ఆలయ అధికారులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో స్వామివారికి హోం మంత్రి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోం మంత్రి అనితకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని క్యూ లైన్లో ఉన్న భక్తులతో హోం మంత్రి అనిత ఆప్యాయంగా మాట్లాడారు. భక్తుల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు దర్శన ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# గిరిజన ప్రాంత ప్రజల వైద్య సేవల్లో నూతన శకం

**కురుపాంలో రూ.3 కోట్లతో 50 పడకల సీహెచ్సీ ప్రారంభం**

**ఆసుపత్రిలో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి**

**రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు సమయపాలన పాటించాలి**

**మన్యం జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కురుపాం, ఆగస్టు 8(మనం న్యూస్): మారుమూల గిరిజన ప్రాంతమైన కురుపాంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్సీ) భవనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు నూతన ఆసుపత్రి భవనాన్ని, అందుబాటులోకి వచ్చిన వైద్య సదుపాయాలను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కేవలం ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్సుతో అప్గ్రేడెడ్ పబ్లిక్ హెల్త్ సెంటర్గా ప్రారంభమైన కురుపాం ఆసుపత్రి నేడు రూ.3 కోట్ల వ్యయంతో 50 పడకల ఆధునిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్గా అభివృద్ధి చెందడం గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

మారుమూల ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే గిరిజనులు, పేదలు, గర్భిణులు, అత్యవసర బాధితులకు వైద్యులు, సిబ్బంది కుటుంబ సభ్యుల్లా భావించి గౌరవప్రదంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, ఆసుపత్రి ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్కు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. జి. నాగభూషణరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా. టి. జగన్మోహనరావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 08: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (క్షఖఋ)-2026 అవార్డులకు ఆన్లైన్ ద్వారా నామినేషన్లు/దరఖాస్తులు స్వీకరించే గడువును కేంద్ర ప్రభుత్వం 2026 ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి కె హరికృష్ణ తెలిపారు. భారతదేశంలో నివసిస్తున్న 5 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉండి, 2026 జూలై 31 నాటికి 18 సంవత్సరాలు దాటని భారతీయ బాల బాలికలు ఈ పురస్కారాలకు అర్హులని తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు మరియు సంస్కృతి, విజ్ఞానం మరియు సాంకేతికత తదితర రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాల బాలికలను ఈ పురస్కారాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

అర్హులైన బాల బాలికలు తమ స్వీయ నామినేషన్తో పాటు ఇతరులు చేసిన సిఫార్సుల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, నామినేషన్లు కేవలం జాతీయ అవార్డుల పోర్టల్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు.ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవడానిక్ఙ్బాజ్ఙ్బుజా అర్ఙ్చటఫ్ఙ్కౌట్బుజా - ఙ్చర్ఙ్చటఫ్ఙ్టజౌరి.జ్ఙ వెబ్సైట్ను సందర్శించాలని ఆయన సూచించారు. గతంలో 31.07.2026గా ఉన్న దరఖాస్తుల చివరి తేదీని కేంద్ర ప్రభుత్వం 15.08.2026 వరకు పొడిగించినందున, అర్హత కలిగిన బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# శశి కళాశాల గుర్తింపు రద్దు చేయాలి!

**పలు ప్రజా సంఘాల డిమాండ్**




ఆనందపురం, ఆగస్టు 8(మనం న్యూస్):ఆనందపురం మండలం బోయపాలెం వద్ద ఉన్న శశి కళాశాల హాస్టల్లో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

హాస్టల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ఆహార నాణ్యత తదితర అంశాలపై అధికారులు విచారణ చేపట్టిన నేపథ్యంలో ప్రజా సంఘాలు స్పందించాయి. విద్యార్థుల భద్రత, ఆరోగ్యంతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఇప్పటికే భీమిలి ఆర్డీవో సంగీత్ మాదర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం హాస్టల్ను పరిశీలించి వివరాలు సేకరించిన విషయాన్ని వారు ప్రస్తావించారు. ఆహార పదార్థాలకు సంబంధించిన నమూనాలను పరిశీలించి, వాటి ఫలితాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల వసతులు, హాస్టల్ నిర్వహణ, పారిశుద్ధ్యంపై అధికారులు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్కు సమర్పించాలని, నివేదికలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు భంగం కలిగించే పరిస్థితులు పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు.

# శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దంపతులు



సింహాచలం, ఆగస్టు 8(మనం న్యూస్): ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం గౌరవనీయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ దంపతులు శనివారం సింహాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని సందర్శించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జల్లేపల్లి వెంకట్రావు వారికి ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. నాదస్వర వాయిద్యాలు మరియు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైస్ ఛాన్సలర్ దంపతులు కు ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. దర్శనానికి ముందు, భక్తుల నమ్మకం ప్రకారం అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని వైస్ ఛాన్సలర్ భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి విశిష్టతను వివరించారు.దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వైస్ ఛాన్సలర్ దంపతులు కు వేద ఆశీర్వచనం గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జె. వెంకట్రావు వైస్ ఛాన్సలర్ ని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను జ్ఞాపికగా స్వామి వారి పటమును అందజేశారు.

# అరకులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- **కలెక్టర్ టి. నిశాంతి మార్గదర్శకత్వంలో విస్తృత ఏర్పాట్లు**
- **ఆగస్టు 10న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలు**



అరకు లోయ, ఆగస్టు 8(మనం న్యూస్): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10వ తేదీన ఉదయం 10 గంటలకు అరకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అల్లూరి సీతారామ రాజు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐఏఎస్ గారి మార్గదర్శకత్వంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగుతోంది. పీవో/ఐటీడీఏ శ్రీ ఆదిత్య వర్మ, ఐఏఎస్ గారి పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి ఈ వేడుకలకు గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు మరియు వారి వారసులు, ప్రముఖులు, ఆదివాసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు, ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం మరియు ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు వేదిక ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, భద్రత, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మీడియా సహకారం కోరిన జిల్లా యంత్రాంగం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై, కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రతిభ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యంత్రాంగం పిలుపునిచ్చింది.

# కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ప్రజలకు అవగాహన



హిందూపురం, ఆగస్టు 8(మనం న్యూస్)ః హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు సంతెబిదునూర్ గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవడంతో పాటు, గ్రామంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను సేకరించారు.

ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులు వివరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏలు శ్రీనివాస్, బాలాజీ, హిందూపురం రూరల్ మండల కన్వీనర్ హెచ్.ఎన్. రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్వత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. ఆనంద్ కుమార్తో పాటు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ




ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఆగస్టు 8(మనం న్యూస్): ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మరియు మేనేజ్మెంట్ విద్య పితామహుడు, 'ఆచార్యులకే ఆచార్యుడు' గా పేరుగాంచిన దివంగత ప్రొఫెసర్ కె. వి. శివయ్య శత జయంతి సందర్భంగా, డిసిఎంస్ విభాగం మరియు ఆ కాలేజ్ ఆఫ్ ఆరట్స్ అండ్ కామర్స్ సంయుక్తంగా 2026 సెప్టెంబర్ 3 మరియు 4 తేదీలలో ఏయూ (AU)లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాయి. 'వికసిత్ భారత్ 2047 దిశగా కామర్స్ మరియు మేనేజ్మెంట్ విద్య పునర్నిర్మాణం' అనే అంశంపై ఈ జాతీయ సదస్సు జరుగుతుంది. ప్రొఫెసర్ కె. వి. శివయ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అనేక కీలక బాధ్యతలను నిర్వహించడంతో పాటు దక్షిణ భారతదేశమంతటా కామర్స్ విద్య విస్తరణకు విశేష కృషి చేశారు.సదస్సు వివరాలతో కూడిన పోస్టర్ను ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో విడుదల చేసారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జలాది రవి, విభాగాధిపతి ఆచార్య ఉమాదేవి, ఆచార్య బి.మోహన వెంకట రామ్, ఆచార్య అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించిన థీంపై ఒరిజినల్ పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పరిశోధనా పత్రాలను ప్రిన్సిపాల్, ఏయూ ఆరట్స్ కామర్స్ కాలేజ్ మరియు,విభాగాధిపతి, CMS, AU కి ఆగస్టు 20వ తేదీలోగా పంపాలి. ఈ సదస్సు యొక్క ప్రధాన ఇతివృత్తం ఆవిష్కరణలు (Innovation), సుస్థిరత (Sustainability), ఉపాధి అవకాశాలు (Employability), డిజిటల్ పరివర్తన (igital Transformation) మరియు గ్లోబల్ పోటీతత్వం (Global Competitiveness) అంశాలపై కేంద్రీకృతమై ఉంటుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ జాతీయ సదస్సులో పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు మరియు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారు. వివిధ రంగాలలో స్థిరపడిన CMS పూర్వ విద్యార్థులు కూడా ఈ సదస్సుకు హాజరవుతారు. ఒక ప్లీనరీ సెషన్ మరియు నాలుగు టెక్నికల్ సెషన్లు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు.

# డీయస్సీ సక్రమమేనని లోకేష్ నిరూపించుకోవాలి

**లేదంటే మంత్రిపదవికి రాజీనామా చేయాలి • పురం వైసీపీ ఇన్ఛార్జ్ దీపిక**



చిలమత్తూరు, ఆగస్ట్ 08, మనం న్యూస్ ః కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అవకతవకలు జరగలేదని, అంతా సక్రమమేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత మంత్రి నారా లోకేష్ పై ఉందని హిందూపురం వైయ్యస్సార్ సీపీ ఇన్ఛార్జ్ దీపికమ్మ డిమాండ్ చేశారు. డీయస్సీ 2025 అక్రమాలపై సిబిఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలో వైయ్యస్సార్ సీపీ చేపట్టిన నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. చిలమత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దీపికమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్వహించింది మెగా డీయస్సీ కాదు.. దగా డీయస్సీ అంటూ దుమ్మెత్తిపోశారు. నియామకాల్లో అవకతవకలు జరగకపోతే దర్యాప్తుకు ఎందుకు బయపడుతున్నారని ప్రశ్నించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. లోకేష్ కష్టపడి చదివి డిగ్రీలు పొంది ఉంటే ఆ బాధ విలువ తెలిసేదని ఏద్దేవా చేశారు. డీయస్సీ మెరిట్ లిస్ట్ దాచేసి ప్రతిభావంతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ఇవ్వకుండా సెలెక్షన్ ఇవ్వడమేంటని అన్నారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ డీయస్సీపై సిబిఐతో దర్యాప్తు చేయించి, తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేణురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ జయశంకరరెడ్డి, ఎంపీటీసీలు ఆదినారాయణప్ప, రఘునాథ్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, మాజీ కన్వీనర్ మదిపి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ సంధ్య, దివాకర్ రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, చిన్నప్పయ్య, అయూబ్, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చేనేతలకు ఉచిత కంటి వైద్యం శుభదాయకం

**శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ఆగస్టు 8 నుంచి 22 వరకు వైద్య సేవలు**



ధర్మవరం, ఆగస్టు 8, మనం న్యూస్ః చేనేత కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్బీఐ కాలనీలోని మధు కంటి వైద్యశాలలో రిటైర్డ్ కంటి అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకారపు నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శనివారం మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల నుంచి విరమణ పొందిన అనంతరం కూడా డాక్టర్ నరసింహులు ప్రజల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వివిధ వర్గాల వారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికుల కోసం ఆగస్టు 8 నుంచి 22వ తేదీ వరకు కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు.చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. నేత కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ మహిళా నాయకురాలు సంకారపు జయశ్రీ, చేనేత నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటో ప్రయాణికుల భద్రతకు డిజిటల్ రక్షణ కవచం...


**క్యూఆర్ కోడ్తో డ్రైవర్, వాహన వివరాలు తెలుసుకునే అవకాశం**

**ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకుండా.. వృత్తికి గౌరవం పెంచడమే లక్ష్యం: మంత్రి సత్యకుమార్**




ధర్మవరం, ఆగస్టు 8(మనం న్యూస్):ఆటో ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆటో రిక్షాల డిజిటల్ రిజిస్ట్రేషన్, క్యూఆర్ కోడ్ ఆధారిత భద్రతా విధానాన్ని శనివారం ధర్మవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకరిద్దరి తప్పిదాల కారణంగా రాష్ట్రంలోని దాదాపు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకూడదన్నారు.ఆటోల్లో డ్రైవర్, యజమానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డుతో పాటు రెండు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గూగుల్ లెన్స్ ద్వారా క్యూఆర్ కోడ్ను స్కాన్ చేస్తే డ్రైవర్, యజమాని వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అవసరమైతే వాటిని ప్రింట్ తీసుకోవడం, కుటుంబ సభ్యులు, స్నేహితులకు వాట్సప్ ద్వారా షేర్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఉన్న ప్రాంతాన్ని పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానం చేసే ట్రాక్ లోకేషన్ సదుపాయం ఉంటుందన్నారు. డ్రైవర్ సేవలపై ప్రయాణికులు రేటింగ్ ఇవ్వడంతో పాటు ఆటోలో వస్తువులు మరిచిపోయినా, ప్రయాణంలో ఇబ్బంది ఎదురైనా క్యూఆర్ కోడ్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయడం, సమీప పోలీస్స్టేషన్, అధికారుల ఫోన్ నంబర్లు తెలుసుకునే సదుపాయం కూడా ఉంటుందని చెప్పారు.

## వారాహిమాతను దర్శించుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



ఏలేశ్వరం, ఆగస్టు 08;(మనం న్యూస్ ): ప్రత్తిపాడు వరపుల సత్యప్రభా రాజా వారాహిమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండువేల పాలన ప్రచారంలో భాగంగా ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో తొమ్మిదో వార్డులో శనివారం ప్రచారం నిర్వహించిన ఆమె కార్యకర్తలతో కలిసి వారి మాత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ప్రస్తుత నేపథ్యంలో కోరిన కోరికలు తీర్చే తల్లిగా ప్రాచుర్యం పొందిందని ఆమెను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఆమె వెంట కూటమి నాయకులు భోదిరెడ్డి గోపి ముది నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

# ఐదు ఎకరాల పొలం ఆదాయానికి దీటుగా పింఛన్ సొమ్ము

### పెట్టుబడి లేదు.. ప్రకృతి వైపరీత్యాల బెడద లేదు.. ప్రతి నెలా గడప వద్దకే అందజేత

### రూ 1.95 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం: మంత్రి నిమ్మల

పాలకొల్లు, ఆగష్టు 8,మనం ప్రతినిధి: ఐదు ఎకరాల పొలం ఉన్న రైతుకు ఏడాదిలో వచ్చే ఆదాయం కు మించి ఎలాంటి పెట్టుబడి లేకుండా, ప్రకృతి వైపరీత్యాల బెడద లేకుండా వృద్ధులు, వితంతువులకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.48 వేల చొప్పున అందిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇదే తరహాలో దివ్యాంగులకు నెలకు రూ 6వేలు చొప్పున, ఏడాదికి 72వేలు అందిస్తున్నామన్నారు.ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్దారుల గడప వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నామని, ప్రజల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.పాలకొల్లు నియోజకవర్గంలో రూ.1.95 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో భాగంగా పాలకొల్లు మండలం వెలివెలలో రూ.10 లక్షలతో చేపట్టే పనులకు మంత్రి నిమ్మల శుక్రవారం కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు.పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ప్రజల



సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, ఏ డి ఏ పి మురళి కృష్ణ, ఏ ఈ ఎల్ శ్రీనివాస్,ఉన్నమట్ల కబర్ధి ఎంపిటిసి గేడ్డం కుటుంబరావు మండలపార్టీ అధ్యక్షులు పాముల రజిని కువూర్ బోడపాటివెంకటనారాయణ, దొమ్మేటి ఏసుదాసు, కోటి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, కండిబోయిన నాగేశ్వరరావు, కండిబోయిన నాగరాజు తోకల సునీల్ బాబు కలిదిండి రామచంద్ర రాజు, అందే కోటి వీరభద్రం, పెద్దింటి శ్రీనివాస్, డాక్టర్ శివ,కొప్పినీడి శ్రీనివాస్,గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు

## బాల్య వివాహ రహిత గ్రామాలే లక్ష్యం



● ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం ఆగస్టు 08 మనం ప్రతినిధి: బాలికల రక్షణ,ఆరోగ్యం,విద్యకు ప్రాధాన్యం కల్పిస్తూ యుక్త వయసులో గర్భధారణలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్లో శనివారం శంఖవరం, ప్రత్తిపాడు సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి, టిడిఆర్ పద్మావతి, ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త మేడిశెట్టి బాబీతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొన్నారు. అంగన్వాడీ సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు.శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని,ప్రతి తల్లి బిడ్డకు తల్లిపాలు అందించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తల్లులు,కుటుంబ సభ్యులకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై నిరంతరం చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య స్పాన్సర్షిప్ పథకం లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం సక్రమంగా అందుతున్న తీరును,లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామాలను బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. బాలికలకు విద్య అందిస్తూ వారి భవిష్యత్తుపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని,చిన్న వయసులో వివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించాలని పేర్కొన్నారు.టీనేజ్ గర్భధారణలు లేని నియోజకవర్గంగా ప్రత్తిపాడును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాలికల ఆరోగ్యం, పోషకాహారం,విద్యపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం తల్లిదండ్రులకే కాకుండా సమాజం మొత్తానికి బాధ్యతగా ఉండాలని సత్యప్రభ పేర్కొన్నారు.

# విద్యార్థులకు అన్నప్రసాదం.. అందని ద్రాక్షనా?

- **మూడు రోజులకే నిలిచిన మధ్యాహ్న భోజన పథకం**
- **పునఃప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల డిమాండ్**

అన్నవరం, ఆగస్టు 8, మనం న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ సంస్కృత ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం మూడు రోజులకే నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. విద్యార్థులకు విద్యతో పాటు పోషకాహారం అందించాలనే సదుద్దేశంతో ప్రారంభించిన ఈ పథకాన్ని తిరిగి పునఃప్రారంభించాలని వారు కోరుతున్నారు. గత నెల 2వ తేదీన దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు



మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి అన్నవరం వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో భోజన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో దేవస్థానం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల అప్పట్లో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అయితే పథకం ప్రారంభమైన కేవలం మూడు రోజులకే కొన్ని ఫిర్యాదులు రావడంతో మధ్యాహ్న భోజనాన్ని నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ పథకం తిరిగి ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులుంటే పరిష్కరించాలి.. పథకాన్ని నిలిపివేయడం ఎందుకు?**

ప్రభుత్వ, దేవస్థానం ఆధ్వర్యంలో అమలు చేసే ఏ కార్యక్రమంలోనైనా లోపాలు ఉంటే వాటిని పరిశీలించి సరిదిద్దాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు భోజనం అందించే కార్యక్రమంలో ఏవైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే వాటిపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, అవసరమైన మార్పులు చేసి పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కేవలం ఫిర్యాదులు వచ్చాయనే కారణంతో విద్యార్థులకు అందుతున్న అన్నప్రసాదాన్ని పూర్తిగా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

## రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే

ఏలేశ్వరం,ఆగష్టు, 08:-(మనం న్యూస్) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఏలేశ్వరం మున్సిపాలిటీ పరుగులు 9వ వార్డులో ప్రచారం నిర్వహించారు.ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కు మహిళలు అపూర్వ స్వాగతంతో అడుగడిగిన నీరాజనాలు పలికారు.ఈ సందర్భంగా సత్య ప్రభ మహిళలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రి లోకేష్ లు సంక్షేమ అభివృద్ధి రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని శారవేగంగా అభివృద్ధి పదంవైపు నడిపిస్తున్నారు అన్నారు.గత ప్రభుత్వంలో చూడని అభివృద్ధి కూటం ప్రభుత్వంలో స్పష్టంగా కనబడుతుందని దీన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థిక పరుపుష్ట పొందే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు యూనిట్ ఇంచార్జి బొదిరెడ్డి గోపి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి,కూటమి పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.విద్య,వైద్యం,మౌలిక



సదుపాయాలు, మహిళా సాధికారత,యువతకు ఉపాధి అవకాశాలు,పేదల సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా పట్టణ ప్రజలు కుల సమస్యలను తెలిపారని వాటిని వెంటనే పరిష్కార దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చామన్నారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు బుగత శ్రీను,వాగు రాజేష్,బస ప్రసాదు,గెట్టెం వెంకటరమణ, దొంతంశెట్టి శైలజ, జనసేన నాయకులు పలివెల వెంకటేష్, మాజీ కాన్సిలర్ ఎండగుడి నాగబాబు, పెంద్ర శ్రీను, కోణాల వెంకట రమణ,పలివెల వెంకటేష్,బంక కోదండరాం,సామంతుల గోపి, కరోతి గాంధీ,శంఖాన్ని బాబ్జి, రుచి రమేష్,పతివాడ అఖిలేష్,కోరాడ సత్తిబాబు,సిడగం బాలు,కరణం నాగార్జున, పలువురు కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## 11న మంగళవారం సర్వసభ్య సమావేశం

కాట్రేనికోన ఆగష్టు 8 మనం ప్రతినిధిః కాట్రేనికోన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ఆగష్టు 11 మంగళవారం ఉదయం గం. 10:30 నిమిషాలకు ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో బి రాజేశ్వరరావు తెలియజేశారు ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ ల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావలసినదిగా తెలియజేశారు సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలియజేశారు సమావేశానికి గైర్హాజరు అయిన అధికారులు మరియు సిబ్బంది వివరాలు జిల్లా కలెక్టర్ వారికి నివేదిక సమర్పించడం జరుగుతుందని కావున సమావేశాన్ని అత్యంత ప్రాధాన్యం కలిగినదిగా భావించాలనిఎంపీడీఓ తెలియజేశారు.

## చేనేతకు ఆధునిక డిజైన్లతో మార్కెట్ డిమాండ్ పెంచాలి

యు.కొత్తపల్లి అగస్ట్ 8 (మనం న్యూస్): ఉప్పాడలోని చేనేత సొసైటీని జిల్లా కలెక్టర్ హరేంద్రి రి ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాస్టర్ వీవర్లు తయారు చేస్తున్న చేనేత ఉత్పత్తులు, మగ్గాలను పరిశీలించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేనేత రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి కొత్త డిజైన్లను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో ఎంఓయూ చేసుకుని మార్కెట్లో డిమాండ్



ఉన్న ఆధునిక డిజైన్లను రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంచీ, బెనారస్, పొందూరు తదితర ప్రాంతాల ప్రత్యేకమైన వీవింగ్ విధానాలను ఉప్పాడ చేనేతలోనూ ప్రవేశపెడితే చేనేత ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు, డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.నేషనల్ లెవెల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఆధునిక డిజైన్లు, నాణ్యమైన ఉత్పత్తులతో చేనేత కార్మికుల ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## పోడూరులో అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ

- **కవురు ఈశ్వరరావు హేమపద్మ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగింపు**
- **వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పంటలు పండాలని ప్రత్యేక పూజలు**

పోడూరు ఆగస్టు 8 మనం న్యూస్ : పోడూరు గ్రామంలో భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ గరగలమ్మ, శ్రీ వెలగలమ్మ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ కనకదుర్గ అమ్మవార్లకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా సారె సమర్పించారు. కవురు వెంకన్న అనసూయ దంపతుల కుమారుడు కవురు ఈశ్వరరావు హేమపద్మ దంపతులు కుటుంబ సభ్యులు, గ్రామ ఆడపడుచులు,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి అమ్మవార్లకు సారె సమర్పించారు.కవురు ఈశ్వరరావు-హేమపద్మ దంపతుల ఇంటి నుంచి ప్రారంభమైన సారె ఊరేగింపు మేళతాళాలు, గరగల నృత్యాలు, తీన్మార్ వాయిద్యాలు, బాణసంచా నడుమ వైభవంగా సాగింది.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు నీళ్ల బిందెలు, వివిధ రకాల స్వీట్లు, అరటిగెలలు,చలివిడి, పానకాలు, పసుపు కుంకుమ, చీరలు,జాకెట్లు తదితరాలను తీసుకుని ప్రదర్శనగా ఆలయాలకు చేరుకున్నారు.అనంతరం



అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి సారెను సమర్పించారు.అదేవిధంగా కోలా విజయ్ దంపతులు కూడా అమ్మవార్లకు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవార్ల కరుణాకటాక్షాలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు.సారె సమర్పణ కార్యక్రమానికి సహకరించిన ఇటుకల దెబ్బ సంఘ మోతుబరులు (పెద్దలు), అమ్మవార్ల కమిటీ సభ్యులకు కవురు ఈశ్వరరావు తన కుటుంబ సభ్యుల పక్షాన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు.అమ్మవార్ల నామస్మరణలు, మేళతాళాలు, గరగల నృత్యాలతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంప్రదాయ నృత్యాలతో ఏలేశ్వరం మరిడమ్మ జాతర



ఏలేశ్వరం,ఆగస్టు 08:-(మనం న్యూస్): ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారిపై గల మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస జాతర మహోత్సవాల సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. గ్రామీణ కలలకు అద్దం పట్టే సంప్రదాయ గరగనూర్యాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతర మహోత్సవాలలో తీన్మార్ తో పాటు నవశక్తి వేషధారణలు అలరించాయి.

## దివ్యాంగులు నేరుగా మొబైల్ వాట్సాప్ ద్వారా రవాణా సేవలు పొందాలి



అమలాపురం ఆగష్టు 8 మనం ప్రతినిధిః దివ్యాంగులు నేరుగా రవాణా సేవలు పొందాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు . దివ్యాంగులు వారి మొబైల్ ఫోన్ లో ఉన్న వాట్సాప్ ద్వారా లెర్నింగ్ లైసెన్స్ రెన్యువల్, లెర్నింగ్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ మొదలగు రవాణా సేవల్ని నేరుగా పొందాలని ఈ వెసులుబాటుని దివ్యాంగులు సద్వినియోగ పరచుకోవాలని అదేవిధంగా మూడు చక్రాల స్కూటర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎటువంటి సందేహాలు, ఇబ్బందులున్నా తన ఫోన్ 92816 07021 నెంబర్ కి చేయాలని డీ.టీ.ఓ తెలిపారు. రవాణా సేవలకు సంబందించి ఎటువంటి పని ఉన్నా శ్రమపడి కార్యాలయానికి రావొద్దని ముందుగా తనను ఫోన్ ద్వారా సంప్రదించాలని డీ.టీ.ఓ విజ్ఞప్తి చేశారు.

## రెండేళ్లు నమ్మకంపై విస్తృతంగా ప్రచారం



కాట్రేనికోన ఆగష్టు 8 మనం ప్రతినిధి: పేదల పక్షాన నిలిచేది టీడీపీ ప్రభుత్వం అని కాట్రేనికోన మండల తెలుగు యువత అధ్యక్షుడు వంగా దుర్గా బాబు పేర్కొన్నారు, మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు, మండల టీడీపీ అధ్యక్షుడు చెల్లి సురేష్ ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా శనివారం కాట్రేనికోన గ్రామ పంచాయతీలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నారన్నారు ఈ కార్యక్రమంలో నాయకులుసుంకర పవిత్ర, సుంకర బుజ్జి, సుంకర శ్రీను,సుభాష్,భరత్ వర్మ, ప్రవీణ్, కుమార్, కూటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## మండలి శతజయంతి స్మారక సాహితీ సభ అతిధులకు ఘన సత్కారం

పాలకొల్లు, ఆగష్టు 8,మనం ప్రతినిధి : పాలకొల్లు లో శ్రీ కృష్ణదేవరాయ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కీ.శే.మండలి శతజయంతి స్మారక సాహితీ సభ ఘనంగా జరిగింది.దేశభాషలందు తెలుగు లెస్స అంటూ., తెలుగు భాష గొప్పదనాన్ని ఎలుగెత్తి చాటిచెప్పిన శ్రీ కృష్ణ దేవరాయల 518 వ పట్టాభిషేకం సందర్భంగా తెలుగు జాతిరత్న, దివిసీమ గాంధీ కీ.శే.మండలి వెంకట కృష్ణారావు శతజయంతి స్మారక వేడుక నిర్వహించడం అంటే తెలుగు భాష కు, రాయలు రచించిన ఆముక్త మాల్యాద మహా కావ్యానికి, పట్టాభిషేక మహోత్సవం



పాలకొల్లులోజరుగుతున్నట్లు సంతోషం గా ఉందని ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్ ల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు సాహితీ ప్రియుల హర్షధ్వనుల మధ్య ప్రస్తుతించారు. పాలకొల్లు త్సవటపల్లి సత్యవతి మెమోరియల్ లయన్స్ కమ్యూనిటీ హాల్ నందు శ్రీ కృష్ణ దేవరాయ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సభ, సాంస్కృతిక ప్రతిభా సత్కారాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా సంస్థ గౌరవ అధ్యక్షులు, యు కె ఎస్ సి గవర్నర్ పెనుమాక రామమోహన రావు, వీరవాసరం నాటక కళా పరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ, ఆంధ్ర సారస్వత్ ఉపాధ్యక్షులు కడిమిళ్ల వరప్రసాద్ శతావధాని, సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు సివివి సత్యనారాయణ మూర్తి ముఖ్య వక్తలుగా భీమవరం విశ్రాంత తెలుగు పండితులు కలిగొట్ల గోపాలశర్మ, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది ధాశరధి శ్రీనివాస్ లు మాట్లాడుతూ... విజయనగర సామ్రాజ్యము కీ.శ.1336 నుండి 1665 వరకు ఎందరో రాజులు పరిపాలించినా 1509 నుండి 1529 వరకు పరిపాలించిన ఓటమిఎరుగని విజేత, సాహితీ సమరాంగాణ సార్వభౌముడు శ్రీ కృష్ణదేవరాయులు ఎనలేని కిర్తికెక్కారని, అలాగే మాజీ మంత్రివర్యులు, నిరాడంబర ప్రజా నాయకుడు, ప్రపంచంచం లో వున్న తెలుగు భాషభిమానులు అందరిని ఏకం చేసి 1975 ప్రపంచ తెలుగు మహాసభలకు సారధ్యం వహించి విజయవంతం చేసి తెలుగు భాషకు, తెలుగు వారికి గౌరవాన్ని చేకూర్చిన తెలుగు జాతిరత్న,దివిసీమ ప్రజల గుండెల్లో కొలువైవున్న, కీ. శే. మండలి వెంకట కృష్ణారావు గారి శత జయంతి స్మారక సాహితీ సభ శ్రీ కృష్ణ దేవ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రం పాలకొల్లు లో నిర్వహించడం అభినందనీయ మని కొనియాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకట రత్నం మాట్లాడుతూ.... చారిత్రక మహనీయులను గౌరవించడం, పూజించడం, స్మరించడం మన తెలుగు వారి సంప్రదాయంఅని, చరిత్రలో మరుగున పడిన చారిత్రక సత్యాలను పరిశోదించడం మన భాద్యతని, ఆచరిత్రక సత్యాలను వెలికితీసి భవితరాలకు, సమాజానికి తెలియజె ప్పడం.... సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికి అవగాహన కల్పించడమే మా ధ్యేయం అని.... మండలి వారి శతజయంతి వేడుక ప్రభుత్వ పండుగగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కు హృదయ పూర్వక ధన్యవాదములు అని నిండు సభలో తెలియజేశారు.ముఖ్య అతిధులు, అభిమానులు మండలి వారి స్మారక సాహితీ సభలో ... రాయల విగ్రహానికి, మండలి వారి చిత్ర పటానికి పూలమాలల తో... ఘనంగా నివాళులు సమర్పించారు.

## మహానందిలో ఏపి వక్స్ బోర్డ్ చైర్మన్ పూజలు



**మహానంది, ఆగస్టు8,మనంన్యూస్ః** మహానందీశ్వరుని సన్నిధిలో ఆంధ్ర ప్రదేశ్ వక్స్ బోర్డ్ చైర్మన్ రామచంద్రుడు,ఆడిట్ డైరెక్టర్ హరి ప్రకాష్ లు పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారి దర్శనానికి వచ్చిన వారికి సూపర్డెంట్ నీలకంఠేశ్వర రాజు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితి ప్రకారం వేదపండితులుశాంతారాం బట్వేదాశీర్వచనం మధ్య కండువా కప్పు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## శ్రీ మఠంలో మానవ హక్కుల కమీషన్ మెంబర్ డాక్టర్ కిషోర్



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్:** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘువేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ కిషోర్ కుటుంబ సభ్యులతో శనివారం వచ్చారు. వారికి మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి , సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘువేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , ఫల మంత్రాక్షితలు , రాఘువేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. మఠం ఇంజినీర్ సురేష్ కొనపూర్ , తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వం అందరికీ భరోసానిస్తోంది



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందని మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ అన్నారు. శనివారం టిడిపి ఇంచార్జ్ ఎన్ రాఘువేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని చట్నీహళ్లి గ్రామంలో టిడిపి ఇంటింటికి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ముందుగా టిడిపి ప్రకటించిన హామీల బుక్ లెట్ ను ఇస్తూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైస్తవ సోదరులకు అన్నివిధాలా అండగా ఉంటా



- **చర్చికి రూ. 7.50 లక్షలం సౌండ్ సిస్టం విరాళం**
- **మంత్రాలయం ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి**

**మంత్రాలయం, ఆగస్ట్ 8,మనం న్యూస్:** మంత్రాలయం నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు అన్ని విధాల అండగా ఉంటానని ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని 52-బసాపురం గ్రామంలో ఉన్న లివింగ్ మినిస్ట్రీస్ చర్చికి యువనేత ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 7.50 లక్షల సౌండ్ సిస్టం ను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం లోని క్రైస్తవ సోదరులకు మా దృష్టిలో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. రాబోయే భవిష్యత్ లో సైతం క్రైస్తవు సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో చర్చి కి సౌండ్ సిస్టం విరాళం అందించినందుకు లివింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ సామేలు అయ్యగారు ఎంఎల్ఏ కు, ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి వైసిపి మండల అధ్యక్షులు గుర్రెడ్డి భీంరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

- **కూటమి ప్రభుత్వం డీఎస్సీ అక్రమాలతో నిరోద్యోగులను దగా చేసింది**



**కౌతాళం, ఆగస్టు 08 మనం న్యూస్ః** డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఆగస్టు 6 నుంచి 9 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం చేపట్టిన డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సంవత్సరాల తరబడి శ్రమించిన నిరుద్యోగ యువతలో ప్రస్తుతం నెలకొన్న ఆందోళనకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. నియామక ప్రక్రియపై అభ్యర్థులు లేవనెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ఆరోపణలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఒక్క అభ్యర్థికి కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.డీఎస్సీ అభ్యర్థుల సమస్య కేవలం ఉద్యోగ నియామకానికి సంబంధించిన అంశం కాదని, వేలాది కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విషయమని పేర్కొన్నారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి వెంట నిలిచి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.యువత భవిష్యత్తును ప్రభావితం చేసే ఉద్యోగ నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉందన్నారు.డీఎస్సీ అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుని,వారి సందేహాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు. నియామక ప్రక్రియపై సమగ్రంగా సమీక్షించి అర్హులైన అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జైపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. డీఎస్సీ అభ్యర్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ఉద్యమిస్తున్నారని, వారి ఆందోళనలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం వారి పక్షాన నిలుస్తుందని తెలిపారు.డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దేశాయి ప్రహ్లాద ఆచారి గారు మాట్లాడుతూ డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలు, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావా లని నాయకులు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలిచి పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.మంత్రాలయంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైయస్ఆ మంత్రాలయం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మండల యువజన విభాగం అధ్యక్షులు తదితర నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఎమ్మెల్యే పిఎ వెంకటరామిరెడ్డి, మాబుసాబ్,మాజీ సర్పంచ్ పాల్ దినకర్, ఏకాంబరం రెడ్డి, రౌడూర్ ఆర్ఎం,సుధాకర్ రెడ్డి,నది చాగి లింగన్న గౌడ్ సూలేకేరి ఆదినారాయణ రెడ్డి,తహేర్ వలి, ఇద్రుస్,జైపాల్, మంత్రాలయం సోషల్ మీడియా తోవి గౌతమ్,సక్రి శ్రీరామ్,వడ్డే నరసింహ, రామకృష్ణ,ఎన్టీఆర్ నగర్ భాషా,జీడి . ఖదీర్,అనీఫ్ సుధాకర్,బసవ మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు మండలం యువజన విభాగ అధ్యక్షులు కార్యదర్శు లు కౌతాళం మండల వివిధ గ్రామాలుకు సంబంధించిన సర్పంచులు నాయకులు కార్యకర్తలు అభిమానులు వారి అందరికీ సంఘీభావం తెలిపారు.

## ప్రసాదాల తయారీ వద్ద పరిశుభ్రంగా ఉండాలి



- **చైర్మన్ నరాల**

**మహానంది, ఆగస్టు8,మనంన్యూస్ః** పవిత్రమైన ప్రసాదాల తయారికేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది పరిశుభ్రతను పాటించాలని మహానందీశ్వర స్వామివారి చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి కోరారు. శనివారం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన వారికి సూపర్డెంట్ శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు.అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలునిర్వహిం చారు. ఆలయ ఆనవాయితి ప్రకారం కళ్యాణ మండపంలో చైర్మన్ కుటుంబ సభ్యులను వేదపండితులు హనుమంతు శర్మ వేదాశీర్వచనం మధ్య కండువా కప్పి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ప్రసాదాల తయారీ కేంద్రంలో లడ్డు, పులిహోరా తయారు చేసేటప్పుడు సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలన్నారు. స్నానం చేసిన తరువాత నే ప్రసాదాల తయారీ కేంద్రం లోకి రావాలని తెలిపారు. వారివెంట పాలకమండలి సభ్యులు నాగేషుడు,టెంపుల్ ఇన్స్పెక్టర్ నగమల్లయ్య, బూత్ కన్వీనర్ హరిప్రసాద్ రెడ్డి, మహిళా నాయకురాలు ఉమాదేవి,తదితరులు వున్నారు.

# మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జైల్‌బరో

- **కార్మికులు, రైతులు, ప్రజలు కదం తొక్కాలి**
- **దేవనకొండ సమావేశంలో కార్మిక సంఘ నాయకుల పిలుపు**



**దేవనకొండ, ఆగస్టు 8, ( మనం న్యూస్ )ః** కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను హరిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్బరో, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎం. నరసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కార్మిక సంఘాల సమావేశం సిఐటియు మండల కార్యదర్శి ఎమ్.అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికులు చెమటోడ్చి సంపద సృష్టిస్తున్నా వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదన్నారు. రూ.31 వేల కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ పనుల్లో కొనసాగుతున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని విమర్శించారు. అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతుల రుణాలు మాఫీ చేసి, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసే చర్యలను ఆపాలన్నారు. 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలన్నారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యుడి జీవితం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కుల, మతాల పేరుతో విడదీసే రాజకీయాలను తిప్పికొట్టి, కార్మికులు-రైతులు-ప్రజలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేయాలని, హంద్రీ-నీవా ద్వారా పంటలకు సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 10న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే జైల్బరో, నిరసన కార్యక్రమాలకు వేలాదిగా తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక,రైతు, వ్యవసాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు యూసుఫ్ భాష,కృష్ణ, వై.మహేంద్ర,రామంజి, భాస్కర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


## యువతకు ఉద్యోగాలు వస్తే వైసీపీకి ఎందుకు కడుపుమంట?

**ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించడం కూడా తప్పేనా?: రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్**



**దేవనకొండ మనం న్యూస్:** మెగా ్ఖఇ ద్వారా యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైసీపీ నేతలకు ఎందుకు కడుపుమంట? ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడాన్ని కూడా రాజకీయంగా చూడటం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. శనివారం ఆమె మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు రావడం చూసి సంతోషించాల్సింది పోయి, రాజకీయ బురద జల్లడం వైసీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో యువత ఎదుర్కొన్న నిరాశను ప్రజలు మర్చిపోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, దాన్ని కూడా జీర్ణించుకోలేక విమర్శలు చేయడం వారి అసహనాన్ని బయటపెడుతోందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, విద్యారంగాన్ని బలోపేతం చేయడం, నిరుద్యోగ యువతలో నమ్మకాన్ని పెంచడం లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. వైసీపీ నాయకులకు ఒకటే చెబుతున్నాం-యువత విజయాలను రాజకీయాలకు లాగవద్దు. రాజకీయాలు చేయాలంటే ప్రజా సమస్యలపై చేయండి. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడం తప్పు కాదు. యువతకు ఉద్యోగాలు రావడం రాష్ట్రానికి గర్వకారణం అని కప్పట్రాళ్ల బొజ్జమ్మ స్పష్టం చేశారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగద్దు



**కౌతాళం,ఆగస్టు 08 మనం న్యూస్ :** మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ నరసింహ ఈరన్న స్వామి శ్రావణమాసం సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి వాణి ఆధ్వర్యంలో వేగంగా పనులు మొదలు పెట్టారు.ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్ వాణి మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే శ్రావణమాసం మహోత్సవం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా దగ్గరుండి పనులు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటికే భక్తులకు రాక,పోకలు ఇబ్బంది కలవకూడదని. ఉద్దేశంతో రోడ్డు పనులు కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా రోడ్డు ఇరు వైపులా అడ్డంగా ఉన్న చెట్టును కూడా తొలగిస్తున్నామని తెలిపారు.ఏది ఏమైనా భక్తుల శ్రేయస్సే మాకు ముఖ్యమని తెలిపారు. ఈ శ్రావణమాసం మహోత్సవం ప్రతి ఒక్కరు సహకారంతో ముందుకు వెళ్లి జయప్రదం చేయాలని ఆలయ డిప్యూటీ కమీషనర్, కార్య నిర్వహణ అధికారి వాణి తెలిపారు.

## జగ్గాపురంలో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

- **ఇంటింటికీ వెళ్లిన టీడీపీ నాయకులు.. ప్రజలతో మమేకం**
- **జగ్గాపురంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం**
- **ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం**



**నందవరం ఆగస్టు 8 మనం న్యూస్ః** నందవరం మండల పరిధిలోని స్థానిక జగ్గాపురం గ్రామంలో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం కొనసాగించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు టిడిపి గ్రామ అధ్యక్షులు ఎల్ఐసి గోపాల్ టిడిపి సీనియర్ నాయకులు నరసింహులు రంగన్న తిమ్మప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జగ్గాపురం గ్రామంలో గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి పథకాలు తీసుకువస్తారని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బూత్ ఇన్చార్జి రుద్ర స్వామి. చిన్న ఈరన్న మరియు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నషా కాదు.. నైపుణ్యం కావాలి!




- **నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ధర్మవరం, ఆగస్టు 8 మనం న్యూస్ మనం న్యూస్ః** "సిగరెట్ కాదు.. శిక్షణ కావాలి. మద్యం కాదు.. మంచి భవిష్యత్తు కావాలి. డ్రగ్స్ కాదు.. డ్రీమ్స్ కావాలి. నిషా కాదు.. నైపుణ్యం కావాలి. వ్యసనం కాదు.. విజయం కావాలి'' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపితేనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ధర్మవరం పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన '10 నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మద్యం, బీడి, సిగరెట్, గుట్కా, గంజాయి, డ్రగ్స్తో పాటు మొబైల్ ఫోన్ వ్యసనం కూడా పిల్లలు, యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. వ్యసనాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ, సామాజిక జీవితం దెబ్బతింటాయని చెప్పారు.


# మట్కా బీటర్లు అరెస్టు

### రూ. 18450 నగదు ,సెల్ ఫోన్‌లు స్వాధీనం

**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో మట్కా బీటర్లు ను మాధవరం పోలీసులు శనివారం పట్టుకున్నారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలు మేరకు రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ రామలింగప్ప , విద్యానగర్ తాండ గ్రామానికి చెందిన బోయరాజు , గంగులప్ప లు రచ్చుమర్రి గ్రామంలో తిమ్మప్ప తాత మఠం దగ్గర ఆన్లైన్ యాప్ ద్వారా మట్కా ఆడుతుండగా రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి ముగ్గురిని అదుపులో తీసుకొని వారి వద్ద ఉన్న రూ. 18,450 నగదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా మట్కా రాసిన లేదా ఆడిన క్రికెట్ బెట్టింగ్ ,తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యం



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజులు అన్నారు. శనివారం టిడిపి ఇన్చార్జ్ రాఘువేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయంలోని పలు కాలనీలో ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు పథకాల గురించి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పవన్ కుమార్ టిడిపి నాయకులు రాఘువేంద్ర తదితరులు ఉన్నారు.

## ప్రజాసేవే ధ్యేయంగా ఎమ్మెల్యే



**కళ్యాణదుర్గం టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్ః** ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముందుకు సాగుతున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికలో 53 మంది అనారోగ్య బాధితులకు మొత్తం రూ.33,16,801 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాల పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## నేతన్నల ఆధ్వర్యంలో నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం



**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్ః** చేనేతల మనగుడి కోసం ఏపీలోని కుటుంబ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని 72 వేలమంది చేనేతలకు 25000 చొప్పున ఆర్థిక సాయం అందించడం పట్ల సోమందేపల్లి మండలంలోని చేనేతలు హర్షం వెలిబుచ్చారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి సవిత చిత్ర పటాలకు కూటమి నాయకులతో కలిసి పాలభిషేకం చేసారు. నేతన్న సేవ పథకం ద్వారా చేనేతలకు 25 వేలు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో నేతన్న సేవ లేకున్నా, మంత్రి సవిత చొరవతో ఈ పథకం ద్వారా 25 వేలు నేతన్నకు వేసినందుకు సీఎం కు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ హయాంలో నేతన్నకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి,పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రమణ, పిఎన్ రామాంజి,ఆన్సర్ బాషా,శివశంకర్ యాదవ్, నాగరాజ్ యాదవ్, డిఆర్ సోమశేఖర్, డీలర్ పెద్దకొడిపల్లి ప్రకాష్, బాలు, పరందమా, జనసేన నాగరాజు,జక్కా చంద్ర,ఉప్పర బాబయ్య,చలపతి, కొట్టాల్ మన్సూర్, బంగారు,నేతన్నలు నారాయణస్వామి, గోవింద్, రామకృష్ణ, వేణు, ఆచారి, నరసింహ, రాధా, చంద్ర, జనసేన వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సెయిలింగ్‌లో తెలంగాణ ఆణిముత్యాలు!

## ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కామారెడ్డి గురుకుల విద్యార్థిని రిష్వితకు రజతం

### ఇటలీలో ముగిసిన ప్రతిష్టాత్మక పోటీలు

**హైదరాబాద్, ఆగస్టు 8 (మనం న్యూస్):** అంతర్జాతీయ క్రీడావేదికపై తెలంగాణ గురుకుల విద్యార్థిని ఘనకీర్తిని ఆర్జించింది. ఇటలీలో జరిగిన ప్రతిష్టాత్మక 'సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ (ప్రమోషనల్ క్లాస్)'లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థిని



ఎస్.రిష్విత రజత పతకంతో మెరిసింది. జూలై 30 నుంచి ఆగస్టు 7 వరకు ఇటలీలోని గార్డా సరస్సు వేదికగా ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. కామారెడ్డి ఎం.జె.పి.టి గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రిష్విత.. అంతర్జాతీయ స్థాయి నావికులతో పోటీపడి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. రిష్విత సాధించిన అద్భుత విజయంపై కామారెడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.మాధవి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల్లోని అంకితభావం, కఠోర శ్రమ,సమయపాలనతో పాటు సమిష్టి కృషే అంతర్జాతీయ వేదికపై మన రాష్ట్రానికి, దేశానికి ఈ అరుదైన గుర్తింపు తెచ్చిపెట్టిందని కొనియాడారు. ముఖ్యంగా ఎం.జె.పి.టి సంస్థ సెక్రటరీ బి.సైదులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక అంశాలపై శిక్షణ ఇప్పించారని, ఆయన ప్రోత్సాహం వల్లే ఇలాంటి పెద్ద పోటీల్లో మన విద్యార్థులు అవకాశాలు అందుకోగలుగుతున్నారని పేర్కొంటూ సెక్రటరీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు మరెంతో మంది యువ నావికులకు (సెయిలర్లకు) స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు ఇది నాంది పలుకుతుందనిఆశాభావం వ్యక్తం చేశారు.

**మంత్రి పొన్నం హర్షం:** అంతర్జాతీయ వేదికపై రజత పతకంతో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన రిష్వితపై ప్రశంసల జల్లు కురుస్తోంది. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రిష్వితకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. బి.సి.సంక్షేమ శాఖ కార్యదర్శి (సెక్రటరీ) బి.సైదులు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఆర్సీఓ సత్యనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ పి.మాధవి తో పాటు పాఠశాల అధ్యాపక, సిబ్బంది బృందం రిష్వితకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్



ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డే క్రికెట్ లో మూడు సార్లు ఆరు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన తొలి స్పిన్నర్ గా చరిత్రకెక్కాడు. ఐర్లాండ్ తో జరిగిన రెండో వన్డేలో 7.4 ఓవర్లలో 34 పరుగులకు 6 వికెట్లు పడగొట్టి ఈ రికార్డు సృష్టించాడు.

రషీద్ 2017లో తొలిసారి ఆరు వికెట్ల ప్రదర్శన (ఐర్లాండ్ పైనే) నమోదు చేశాడు. అదే ఏడాది విండీస్ పై 7-18 ప్రదర్శన నమోదు చేసి రెండోసారి ఈ ఘనత సాధించాడు. తాజాగా ఐర్లాండ్ పై మరోసారి 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసి, వన్డే క్రికెట్ లో మూడోసారి ఈ ఘనత సాధించిన తొలి స్పిన్నర్ గా చరిత్ర సృష్టించాడు.

ఓవరాల్ గా వన్డేల్లో అత్యధిక సార్లు 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన రికార్డు పాక్ స్పీడ్ స్టర్ వకార్ యూనిస్ పేరిట ఉంది. వకార్ ఏకంగా ఐదుసార్లు 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. స్పిన్ విభాగంలో రషీద్ తర్వాతి స్థానంలో వనిందు హసరంగ (2) ఉన్నాడు.

పేస్ విభాగంలో వకార్ తర్వాతి స్థానంలో ట్రెంట్ బౌల్ట్ (2) ఉన్నాడు. భారత్ తరపున ఆశిష్ నెహ్రా వన్డేల్లో రెండుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శనలు నమోదు చేశాడు. రషీద్ ఖాన్ వన్డేల్లో ఇప్పటివరకు ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు చేశాడు. టెస్ట్ ల్లో ఐదు సార్లు, టీ20ల్లో రెండు సార్లు ఈ ఘనత సాధించాడు.

ఇదిలా ఉంటే, రషీద్ స్పిన్న్ మాయాజాలం దెబ్బకు రెండో వన్డే ఐర్లాండ్ పై ఆఫ్ఘనిస్తాన్ 92 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ జట్టు 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేయగా.. ఐర్లాండ్ 33.4 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది.

తడి ఔట్ ఫీల్ కారణంగా ఈ మ్యాచ్ ను తలో 47 ఓవర్లకు కుదించారు. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ ఐదు మ్యాచ్ ల సిరీస్ లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ సిరీస్ లోని తొలి వన్డే వర్షం కారణంగా తుడిచిపెట్టుకు పోయింది. మూడో వన్డే బెల్ ఫాస్ట్ వేదికగా ఆగస్ట్ 10న జరుగనుంది.



## శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్..

# రెండో రోజు ముగిసిన ఆట

శ్రీలంక క్రికెట్ ఎలెవన్, భారత్ మధ్య జరుగుతున్న మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ లో రెండో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ను శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేయగా.. తర్వాత బ్యాటింగ్ కు దిగిన టీమ్ఇండియా శనివారం ఆట ముగిసే సమయానికి 357/6 స్కోరుతో నిలిచింది. భారత్ ఇంకా ఆరు పరుగుల వెనుకంజలో ఉంది. దేవదత్ పడిక్కల్ (142*; 137 బంతుల్లో 14 ఫోర్లు) శతకంతో ఆకట్టుకున్నాడు. పడిక్కల్ తోపాటు గుర్నూర్ బ్రార్ (36*; 18 బంతుల్లో) క్రీజులో ఉన్నాడు. నాలుగో స్థానంలో వచ్చిన రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్; 117 బంతుల్లో) రాణించగా.. కేఎల్ రాహుల్ (40; 67 బంతుల్లో), మానవ్ సుతార్ (41; 90 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. సరాంశ్ జైన్ (22) రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. యశస్వి జైస్వాల్ ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్ గా వెనుదిరగ్గా.. రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆట చివర్లో గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్ లో నాలుగు సిక్స్ లు బాదేశాడు. శ్రీలంక బౌలర్లలో రమేశ్ మెండిస్ 2, అసంక మనోజ్ 2, కేసర నువాంత, విశ్వ ఫెర్నాండో ఒక్కో వికెట్ పడగొట్టారు.

## లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం

అర్జెంటీనా స్టార్ ఫుట్బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం నెలకొంది. మెస్సి తండ్రి జార్జ్ మెస్సి (68) దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అర్జెంటీనాలోని తన స్వస్థలమైన రోసారియోలో శుక్రవారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) కన్నుమూశారు. లియోనెల్ కెరీర్ను తీర్చిదిద్దడంలో జార్జ్ కీలకపాత్ర పోషించారు. చిన్ననాటి నుంచి అంతర్జాతీయ సాకర్ దిగ్గజంగా ఎదిగే వరకు మార్గనిర్దేశం చేశారు. జార్జ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని మెస్సి కుటుంబం జూన్లో ఒక ప్రకటన విడుదల చేసింది. ఫిఫా ప్రపంచ కప్ సమయంలో జార్జ్ మరణించినట్లు వార్తలు రాగా.. కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.



# రామాయణ.. రిలీజ్‌లో కొత్త ట్విస్ట్

రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'. ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్ లో ముందుగా.. ఆ తర్వాత భారత్ లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. ''నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి (నవంబర్ 8) రోజే విడుదల చేస్తాం'' అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్ బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.



# డేటింగ్ రూమర్స్.. మృణాల్ స్పందన ఇది



సినిమా సెలబ్రిటీలకు సంబంధించి ఎప్పటికప్పుడు రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. అలా రీసెంట్ టైంలో హీరోయిన్ మృణాల్ ఠాకుర్ గురించి ఒకటి బయటకొచ్చింది. భారత యంగ్ క్రికెటర్ యశస్వి జైస్వాల్ తో డేటింగ్ లో ఉందని అన్నారు. ముంబైలోని ఓ కాఫీ షాప్ లో జంటగా కనిపించారని పుకార్లు తెగ అల్లేశారు. ఇప్పుడు దీనిపై స్వయంగా మృణాల్ స్పందించింది. కామెంట్ పెట్టి క్లాస్ పీకింది.

తను-జైస్వాల్ వైరల్ వీడియోకు సంబంధించి ఓ ఇన్ స్టా ఖాతాలో పోస్ట్ కనిపించగా.. దానికి మృణాల్ కామెంట్ పెట్టింది. ఒకేచోట కనిపించినంత మాత్రాన ఇద్దరి మధ్య సంబంధం ఉందని ఎలా భావిస్తారు? అలా ఎలా అనుకుంటారు? అని ప్రశ్నించింది. 'బ్రో రిలాక్స్.. మేమిద్దరం కలిసి ఎక్కడ కనిపించాం? మీరు ఇంత చదువుకున్నవాళ్లు కానీ ఇలాంటి పుకార్లను నిజమని ఎలా నమ్ముతున్నారు? దేశంలో ఎన్నో విషయాలు జరుగుతున్నాయి. జెన్-జీ నుంచి కొంత నేర్చుకోండి. సరైన సమస్యలపై వీడియోలు చేయండి. అప్పుడు మరిన్ని వ్యూస్ వస్తాయి' అని మృణాల్ కామెంట్ చేసినట్లు ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇది రూమర్ కి స్పందించినట్లు లేదు. చిన్నపాటి క్లాస్ పీకినట్లు ఉంది.

అయితే మృణాల్ పై డేటింగ్ రూమర్స్ ఇదేం కొత్త కాదు. తమిళ హీరో ధనుష్ తో డేటింగ్ లో ఉందని, వాలంటైన్స్ డే నాడు పెళ్లి కూడా చేసుకోబోతున్నారని తెగ మాట్లాడుకున్నారు. తీరా చూస్తే అవన్నీ ఒట్టి పుకార్లు మాత్రమేనని తేలిపోయింది. ఈ బ్యూటీ కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాది ఈమె నుంచి మూడు సినిమాలొచ్చాయి. వాటిలో 'డెకాయిట్' అనే తెలుగు మూవీ ఉంది. త్వరలో 'పూజా మేరీ జాన్' అనే ఓటీటీ చిత్రంలో కనిపించనుంది.

# అందరినీ కలిపి క్రేజీ సాంగ్ ప్లాన్ చేసిన అనీల్ రావిపూడి!

విక్టరీ వెంకటేష్ అలాగే నందమూరి కళ్యాణ్ రామ్ లు హీరోలుగా కీర్తి సురేష్, కృతి శెట్టిలు హీరోయిన్స్ గా బ్లాక్ బస్టర్ దర్శకుడు అనీల్ రావిపూడి కలయికలో మరో సాలిడ్ మల్టీస్టారర్ తెరకెక్కుతున్న సంగతి అందరికీ తెలిసిందే. మళ్ళీ సంక్రాంతికి మరో సాలిడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్లాన్ చేస్తున్న ఈ చిత్రాన్ని మేకర్స్ శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

ఇలా ప్రస్తుతం సినిమాపై ఇంట్రెస్టింగ్ రిపోర్ట్ ఇపుడు తెలిసింది. మేకర్స్ ప్రస్తుతం 'గుంటూరు కారం' హౌస్ షూట్ లో అది కూడా ఓ క్రేజీ సాంగ్ షూట్ లో బిజీగా ఉన్నట్టు కన్ఫర్మ్ అయ్యింది. ఈ సాంగ్ షూట్ లో మొత్తం నలుగురు స్టార్స్.. వెంకీ మామ, కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ అలాగే కీర్తి సురేష్ లు పాల్గొననున్నారు.



జీవి ప్రకాష్ మంచి ఎనర్జిటిక్ ట్యూన్ అందించినట్టు తెలుస్తుంది. ఇక ఈ షెడ్యూల్ ఈ ఆగస్ట్ 20 వరకు కొనసాగనుందట. సో మొత్తానికి ఇలా షూట్ సూపర్ ఫాస్ట్ గా పూర్తవుతుంది. ఇక ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ అలాగే షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# యంగ్‌గా కనిపించాలనే తాపత్రయం నాకు లేదు: మాధవన్

సినిమా రంగంలో వయసు మళ్లే కొద్దీ నటీనటులు తమ లుక్స్ ను కాపాడుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఆర్. మాధవన్ మాత్రం దీనికి పూర్తి భిన్నమైన ఆలోచనతో ఉన్నారు. వయసు పెరగడాన్ని, తెల్ల జుట్టును తాను ఆనందంగా ఆస్వాదిస్తానని తెలిపారు. తెర వెనక సహజంగా ఉండడమే తనకు ఇష్టమని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ''నాకు అబద్ధాలు చెప్పడం రాదు. తెల్ల జుట్టు దాచడానికి ఇష్టపడను. సినిమాలో పాత్ర కోసం అవసరమైతే తప్ప.. ఎప్పుడూ జుట్టుకు రంగు వేసుకోను. ఈ విషయాన్ని నేను రజనీకాంత్ నుంచి నేర్చుకున్నాను. ఆఫ్ స్క్రీన్ లో ఎలా కనిపిస్తున్నారనే విషయాన్ని ఆయన అస్సలు పట్టించుకోరు. కానీ స్క్రీన్ పై మాత్రం మ్యాజిక్ చేస్తారు. నా మిత్రుడు అజిత్ కుమార్ కూడా అంతే'' అని చెప్పారు.

''కెరీర్ పరంగా ప్రస్తుతం చాలా ప్రశాంతంగా ఉన్నాను. వయసులో చిన్నవాడిగా కనిపించాలనే తాపత్రయం నాకు లేదు. ఇండస్ట్రీలో నేను ఎవరితోనూ పోటీ పడడం లేదు. నాలోని నటనను మరింత మెరుగుపరుచుకోవడంపైనే నా పోటీ. నేను ఎలా ఉన్నానో నన్ను నేను మనస్ఫూర్తిగా ఇష్టపడతాను'' అని మాధవన్ అన్నారు. విభిన్న కథాంశాలను ఎంచుకునే మాధవన్.. తాజాగా భారతీయ ఎడిసన్ గా పేరుగాంచిన గోపాలస్వామి దొరైస్వామి నాయుడు అలియాస్ జి.డి.నాయుడు బయోపిక్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కృష్ణకుమార్ రామ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో మాధవన్ మెప్పించారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.